ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

ఏప్రిల్ 19, 2015

సంగీత భరిత ప్రేమకథ **అనార్కలి**

పెళ్ళి కలేనా!

విషయం వుంటే విజయమే

అన్నీ మార్కెట్లో సరకులైపోయాయండీ బాబూ! ఏదీ నిజమని నమ్మటానికి లేకుండా పోయింది! ఆఖరుకు పత్రికల్లో, టీవీ చానళ్లలో కనిపించే, వినిపించే వార్తలు, కథనాలను కూడా నమ్మడానికి లేదు. వాటిని సైతం కొనేస్తున్నారు. తమకు అనుకూలంగా ఇచ్చేసుకుంటున్నారు. సినిమా న్యూసూ, స్టోరీలూ అందుకు మినహాయింపు కాదు. ఇదే విషయమై జాతీయ నటి కంగనా రౌనత్ కూడా గార్థిగానే మాట్లాడింది. ఇటీవల అనుపమ చోప్రా పుస్తకావిష్కరణ సందర్భంగా ఈ విషయమై తన మనసులోని మాట వెల్లడించింది . మీడియాలో వచ్చే కథనాలకోసం ఎంతో ఖర్చు చేస్తుంటారు. ఒక్కోసారి పేజీ అంతా కథనం వచ్చేలా చూసుకుంటారు. సినిమా నిర్మాణం, మార్కెట్ చేసుకోవడం మీద ఖర్చు చేయడం కంటే... దానివైపే ఎక్కువగా మొగ్గు చూపుతారన్నది ఆమె అభియోగం. అయితే అది ఎంతవరకు లాభం చేకూరుస్తున్నది ఎవరికీ తెలీదు. "క్వీన్ వంటి సినిమా బాగా ఆడిందంటే... దానికి కారణం అందులో వున్న చిక్కనైన కథ. ఏ సినిమాకైనా ఇది అవసరం. అలాగే... ఓ చిత్రానికి సంబంధించిన ప్రతి దాన్ని డబ్బుతో కొనాలని చూస్తుంటారు. సినిమాపై మీడియా అభిప్రాయాల నుంచి సమీక్షల వరకు ప్రతిదీ కొనేందుకు మొగ్గు చూపుతారు. చిన్న సినిమాలు తీసిన దర్శకనిర్మాతలకు ఇదెలా కుదురుతుంది చెప్పండి? ఇలాంటి పరిస్థితుల్లో వారు మనగలగడం చాలా కష్టం" అంటోంద్ కంగనా. కంగనా. క్వీన్ చెప్పింది కరెక్టే కదా!

కంగనా రౌనత్


రణబీర్ కపూర్

'క్వీన్'తో నటించాలని వుందట!

'క్వీన్'లో కంగనా రౌనత్ నటన చూసి ఫ్లాట్ కాని వారు లేరు! బిగ్ బి అమితాబ్, మిస్టర్ పర్‌ఫెక్ట్ ఆమీర్ ఖాన్ మొదలుకొని రణబీర్ కపూర్ వరకు చిత్ర పరిశ్రమలో అందరూ క్వీన్ ఫ్యాన్లయిపోయారు. వారు కురిపించే ప్రశంసల జల్లులో కంగనా తడిసిపోతోందనుకోండి. రణబీర్‌కైతే ఆమెతో కలిసి నటించాలని కూడా వుందట. తన 'బాంబే వెల్వెట్, జగ్గు జాసూస్' చిత్రాలు త్వరలో విడుదల కానున్నాయి. మరి ఆ తర్వాత ఏంటి అంటే...?! కొత్త జోడీ అనేకంటే కత్తి లాంటి జోడీ... మాంచి కథ దొరికితే నటించడానికి రణబీర్ సిద్ధంగా వున్నాడు. కంగనా లాంటి కథానాయిక అయితే కాంబినేషన్ అదిరిపోతుందని అతని సన్నిహితులు చెప్తున్నారు. అయితే కపూర్ ఇటీవలి చిత్రాలు 'బేశరమ్, రాయ్' అంతగా మెప్పించలేకపోయాయి. కానీ... 'క్వీన్' కంగనా, 'బర్ఫీ' కపూర్ జంటగా చేస్తే... రణబీర్‌ను తిరిగి విజయలక్ష్మి వరించే అవకాశాలున్నాయని విమర్శకుల అభిప్రాయం.

●

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

జైలు పక్షులు

కళలన్నిట్లోకి కఠినమైనది చోర కళ! మూడో కంటికి తెలీకుండా నొక్కేయడం ఎంత కష్టమో దొంగకు మాత్రమే తెల్సు. పైగా ఈ కళ అంత త్వరగా ఒంటబట్టి చావదు కూడా. ఒకవేళ పట్టిందో! పుటకల్లో పెట్టేదాకా పోదు.

కాకపోతే ఎంత చెయ్యి తిరిగిన చోరుడైనా సరే పట్టుబడకుండా వుండే చాన్సే లేదు! చిక్కాక ఊరుకుంటారా! పోలీసు బాబాయిలు బేడీలేస్తే...న్యాయమూర్తులు శిక్షలు ఖరారు చేస్తారు. చోరులు అంతిమంగా జైలు పక్షులుగా రూపాంతరం చెందుతారు.

* * *

జైళ్లకు దేశభక్తులూ వెళ్తుంటారు. అయితే వీరు జనం కోసం, వారి హక్కుల కోసం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పోరాడి కటకటాల పాలౌతుంటారు. రోజులు...నెలలు.. ఏళ్ళ తరబడి ... కుటుంబాలకు దూరంగా... జైళ్లల్లో మగ్గుతుంటారు. అందుకే ... తమ కోసం జైళ్లపాలైన వారంటే ప్రజలకెంతో గౌరవం, భక్తి కూడా.

* * *

ఇటీవల చోటా మోటా దొంగతనాలు చేసి ఊచలు లెక్కించేవారికంటే... బడా మోసాలు చేసి జైళ్లపాలౌతున్న వారే ఎక్కువ. జైల్లో పడేవరకూ వీరిని దొంగలుగా గుర్తించడం కష్టమే. గతంలో దొంగలనగానే నల్లటి భారీకాయం...గళ్ల చొక్కాలు, లుంగీలు, మొహాన పులిపిరులు, బొడ్లో కత్తి... స్ఫురించేవి. ఆధునిక చోరాగ్రేసరులను గుర్తించడం మామూలోళ్ల వల్ల కాదు. సి.ఐ.డిలు, సి.బి.ఐలు దిగి రావాల్సిందే. ఎందుకంటే ... వీరు పెద్దల్లో పెద్దలు. నేతల్లో నేతలు. పాలకుల్లో పాలకులు. అధినేతల్లో అధినేతలు. పట్టు బట్టలు కట్టుకొని, అత్తర్లు చల్లుకొని పూర్తి సెక్యూరిటీ మధ్యన సంచరిస్తుంటారు మరి.

* * *

వీరిలో ఒకరు భూబకాసురుల్లా గనులు మాయం చేస్తే... మరొకరు బొగ్గునే బొక్కేశారు. ఇంకొకరు స్పెక్ట్రమ్‌నే చప్పడించేస్తే ... మరొకరు గడ్డినే హాంఫట్ చేసేశారు. సైన్యానికి కట్టించే ఇళ్లలోనూ...ఆఖరికి శవపేటికల్లోనూ... అంతర్జాతీయ స్థాయి క్రీడల నిర్వహణలోనూ...సాఫ్ట్‌వేర్ సంస్థల ముసుగులోనూ భా.......రీ మొత్తాలను భోంచేసేశారు. పీఎంలుగా, సీఎంలుగా, సీఎం సంతానంగా వున్న మేడమ్స్... సార్స్... ఆస్తులకు మించిన ఆదాయాలను కూడబెట్టేశారు (తిలా పాపం తలా పిడికెడు అన్న సామెత ఇలాంటి వారిని చూసే పుట్టి వుంటుంది).

పాపం పండి జైళ్లలో పడే వరకు తెలీదు జనానికి! ఎవరు దొంగలో! ఎవరు దొరలో! కార్పొరేట్లతో లావాదేవీలు చేసేవారెవరైనా సరే... రేపటి జైలుపక్షులుగా మారే అవకాశముందట! ఎవరో అన్నారీమధ్యే!

■

◆ మనలో మాట



టపా

చక్కటి ఉదాహరణ

పికాసో! ఈ పేరు తెలియనివారెవరుంటారు! అతనిని తలుచుకుంటే చాలు. అతడు గీసిన చిత్రాలు కళ్ల ముందు కదులుతుంటాయి. అతనిలో తపనను గుర్తించిన తన తండ్రి బాల్యంలోనే శిక్షణ ఇచ్చాడు. స్వతహాగా తండ్రి కూడా చిత్రకారుడే కావటం వల్ల ఆ లక్షణాలు వచ్చినట్టున్నాయి. ప్రస్తుతం తల్లిదండ్రులు మా పిల్లవాడు గొప్ప ఇంజనీరు కావాలి. గొప్ప డాక్టరు కావాలని కలలు కంటారు. గాని పిల్లవాడికి ఏ రంగంలో ఆసక్తి ఉందో తెలుసుకొని ఆ రంగంలో శిక్షణ ఇప్పించడం మంచిది. నేటి తల్లిదండ్రులకు ఇది ఒక చక్కటి ఉదాహరణగా మిగులుతుంది.

-జగదీష్, శ్రీకాకుళం.

ఆశ్చర్యపోయా

కాటికాపరి అంటే మనకు గుర్తు వచ్చేది. ఆరుడుగుల ఎత్తు, నల్లటి జుట్టు, పెద్ద కడుపు. కాని మనం నమ్మలేని నిజాలు చాలానే ఉంటాయి. అందులో ఒకటి ఈ కనకమ్మ జీవితం. తన భర్త క్షయ వ్యాధితో మరణించడం వల్ల ఆ వృత్తినే తనూ చేపట్టింది. చదివిన వెంటనే ఆశ్చర్యపోయా! ఆడవారు అన్ని రంగాల్లో ముందు ఉంటారని చెప్పడానికి ఈ వ్యాసమే నిదర్శనం.

-చందు, విశాఖపట్నం.

నీటికోసం ఇన్ని కష్టాలా!

మహారాష్ట్రలోని ఓ మారుమూల పల్లె నీటి కోసం ఎన్ని కష్టాలు పడుతున్నారో చూస్తూంటే ఆధునిక యుగంలో కూడా ఇలా నీటి కోసం ఎంతో కష్టపడుతున్నారని ఈ వ్యాసం ద్వారా తెలిసింది. అంతేలా మన నాయకులు ఉన్న వాటిని పూడ్చివేసి స్మార్ట్ విలేజ్‌లు, కొత్త కొత్త నగరాలు కట్టడం ద్వారా భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. కొన్ని రోజులకు మనకూ ఇలాంటి పరిస్థితే వస్తుందేమో!

-స్వాతి, కడప.

అపురూప చిత్రం

కన్యాశుల్కం ఒక చక్కటి నాటకం. వీడియోలు లేని రోజుల్లో కూడా ఇలాంటి గొప్ప నాటకాన్ని అందించిన గురజాడ అప్పారావు గొప్ప రచయిత. అందులోని ప్రతి ఒక సన్నివేశం సాధారణ జీవితానికి అద్దం పట్టే విధంగా ఉంటుంది. అలాంటి కమనీయ నాటకాన్ని సినిమాగా తీసిన దర్శక నిర్మాతలు, నటీనటుల మాదిరిగా ఎప్పటికీ ప్రేక్షకుల హృదయాల్లో నిల్చిపోతారు.

-గోపి, వల్లూరు.

చూశాకే తెలిసింది

మానవుని నిత్యజీవితంలో అరటిపండు ఒక భాగం అయిపోయింది. అందులో ఉండే క్యాలరీలు ప్రతి ఒక్కరికి అవసరం. కాని అదే అరటిపండుతో ఎన్నో కళాత్మకమైన రూపాలు ఇవ్వడం అనేది చాలా గొప్ప పని. అరటితో కూడా ఇలాంటి ఆర్ట్‌లు గీయవచ్చు అని 'స్నేహ' చూసిన తర్వాతే మాకు తెలిసింది.

-శ్రీనాథ్, నెల్లూరు.

తెలుసా?

ప్రతివారం తెలుసా అనే ఇచ్చే వ్యాఖ్యలు చాలా బాగున్నాయి. మనకు తెలియని వాస్తవాలు చాలా వరకు ఉన్నాయి. వాటి గురించి మాకు తెలియజేయడం సంతోషంగా ఉంది. అలాగే కలర్ పేజీలలో ఇచ్చిన నేత చీరల్లో నాయికలు అనే శీర్షిక బాగుంది. వేసవికాలంలో కాటన్ చీరలు హాయిగా, హుందాగా ఉంటాయి. అలాంటిది సినీ తారలు ధరిస్తే ఎలా ఉంటారో మాకు తెలిపినందుకు ధన్యవాదాలు.

- లీల , ప్రొద్దుటూరు.

ఈ సంచికలో....

పెళ్లి కరేనా?

కవర్‌స్టోరీ ———— 14

మూడు ముడుల చేరిక, రెండు హృదయాల కలయిక, ఇద్దరిదీ ఒకే జీవితంగా పొందిక... ఇవీ ఒకప్పటి పెళ్లినాటి ముచ్చట్లు. మూడు ముళ్ల గాయం, రెండు హృదయాల యుద్ధం, నాదన్నది ఒకటే జీవితం..అది ఇంకొకరి హస్తగతం... ఇవీ నేటి పెళ్లిడు తరపు ఇక్కట్లు.

కళ్యాణ ఘడియలు మరీ ఆలస్యంగా మోగుతున్నాయి. ప్రేమల్లో విరహాలు విహరిస్తున్నంత తేలిగ్గా వివాహంపై వ్యామోహాలు పుట్టట్లేదు.

సందర్భం 3
ఆటను ఆస్వాదించటం నేర్చుకున్నా...

తెలుసా....? 4

వింతలోకం 5
ఖరీదైన 'షి'కారు

కథ 6
కాబూలీ వాలా

నవ్వుల్ - పువ్వుల్ 9

చూద్దామా 10
ఓ కుటుంబం.. ఒక కారు.. 12 దేశాలు

సీరియల్ 18
ప్రేమ విప్లవం

రుచి 21
దహీ బేంగన్

బాలనేస్తాలు 22
నేటి కొటిల్యుడు

కొత్త పుస్తకాలు 24
ప్రగతికి ప్రస్థానం సైన్సు

సంగీత భరిత
ప్రేమ కథ అనార్కలి
.... 12

ఆటను ఆస్వాదించడం నేర్చుకున్నా

మిథాలీ రాజ్! భారతీయ మహిళా క్రికెట్ బృందం కెప్టెన్! పద్మశ్రీ అవార్డు గ్రహీత! అని మాత్రమే మనకు తెలుసు. కానీ... ఏడేళ్ల చిన్నారి మిథాలీకి డాన్స్ అంటే ప్రాణమనీ.... అందుకే డాన్సు క్లాసుల్లో చేరిందనీ.... ఆ తర్వాత నాన్న నిర్ణయం మేరకు క్రికెట్ బ్యాట్ పట్టుకుందనీ ఎందరికి తెలుసు.! ఇలాంటి ఎన్నో విషయాలను మనతో పంచుకుంటోందీ యువ క్రికెటర్.

- నాన్న భారతీయ వైమానిక దళంలో పనిచేసేవారు. ఆయనకు గుజరాత్‌లో పోస్టింగ్ పడినప్పుడు నేను పుట్టాను. అందువల్ల నేను గుజరాతీ అమ్మాయిననుకుంటారు కొందరు. అయితే మూలాలు హైదరాబాద్‌వే.
- నాన్న వల్లే నేను క్రికెట్‌ను ఎంచుకున్నాను. ఆయనకు ఆటలంటే మక్కువ. మన సమాజంలో ... మహిళలకు ఎంపిక చేసుకునే అవకాశం లేకున్నా ... నేను క్రీడాకారిణిని కావాలని కోరుకున్నారాయన. కానీ నేను మాత్రం అలా అనుకోలేదు. మంచి డ్యాన్సర్ కావాలని ఆశ పడేదాన్ని. అందుకే ఏడేళ్ల వయసులో డాన్స్‌ను ఎంచుకున్నాను. ఆ తర్వాతే క్రికెట్ బ్యాట్ తీసుకున్నాను.
- చదువుకు ప్రాధాన్యతనిచ్చే దక్షిణ భారతీయ కుటుంబంలో పుట్టాను. అందువల్లే... నా విషయంలో అమ్మానాన్నల నిర్ణయం మా బంధువులకు నచ్చలేదు. దానికితోడు క్రీడల్లో పురుషాధిక్యత ఎక్కువన్నది తెలిసిన విషయమే. కెరీర్ మొత్తంలో... ఈ ప్రతికూల వాతావరణం నుంచి నన్ను కాపాడుకుంటూనే... నాకు మద్దతునిచ్చారు అమ్మానాన్నా. నేను ఇంతకాలం ఈ రంగంలో కొనసాగడానికి ప్రధాన కారణం వారే.
- తొలిసారిగా ఆటలో ప్రదర్శించిన ప్రతిభ క్రీడాకారుల భవిష్యత్తును నిర్ణయిస్తుంది. నేను ఒక్క సిరీస్ క్రీడాకారిణిగానే మిగిలిపోదల్చుకోలేదు. మహ్మద్ అజారుద్దీన్ తన మొదటి ఆటలోనే సెంచరీ చేశాడు. అలా అద్భుతంగా ఆడాలన్న ఒత్తిడి నా మీద వుండేది (అనుకున్నట్టుగానే 120 పరుగులు తీసింది).
- ఇంత సుదీర్ఘకాలం క్రికెట్ ఆడుతున్నప్పటికీ ...దాన్ని ఆస్వాదించలేకపోయాను. నాకోసం ఎన్నో త్యాగాలు చేసిన అమ్మానాన్నల కోసం ఆటను ఒక డ్యూటీ మాదిరిగా చూసేదాన్ని. గణాంకాలు నేను బాగానే ఆడుతున్నానని చెప్తున్నప్పటికీ ఎన్నో సవాళ్లు ఎదురుగా కాచుకుని వుండేవి. ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా ఎప్పుడూ నా శక్తిమేరకు ఆడేదాన్ని.
- గాయం వల్ల 2009 ప్రపంచ కప్ తర్వాత క్రికెట్ నుంచి రిటైర్ అవుదామనుకున్నా. (టీమ్ అద్భుతంగా ఆడి రన్నరప్‌గా నిల్చింది). కానీ మరింత బాధ్యత నామీద వుందని... ముందుకు నడవాలని... అప్పుడే నాకు అర్థమైంది. ఇన్నేళ్లలో క్రికెట్ కోసం ఎన్నిటినో వదులుకున్నాను. స్కూల్లో, కాలేజీలో పెద్దగా స్నేహితులే లేరు. వున్న ఒక్కగానొక్క చిన్ననాటి స్నేహితురాలితో ఇప్పటికీ మాట్లాడుతుంటాను. చివరికి... ఇప్పుడర్థమైంది. ఆట ఆడడమే కాదు. దాన్ని ఆస్వాదించగలగాలి అని.
- పద్మశ్రీ అవార్డు అందుకోవడం ఓ అద్భుతం. ఎందుకంటే మాకు సంబంధించిన వార్తలు, కథనాలు చాలా తక్కువగా వస్తుంటాయి. పురుషుల క్రికెట్ ప్రసారం చేసినట్టుగా మహిళా క్రికెట్‌ని చానళ్లలో చూపించరు. అసలు మేం ఏం ఆడుతున్నామో కూడా ప్రజలకు తెలియని పరిస్థితి. ఇన్నేళ్ల తర్వాత కూడా ఎలాంటి మార్పు తీసుకురాలేకపోయామని నాకెంతో బాధగా వుంటుంది.
- నేను కాస్త విశ్రాంతి తీసుకోవడానికి వీలైన సమయమిది (వెన్ను గాయానికి చికిత్స చేయించుకునే పనిలో వుండడడం వల్ల). తిరిగి ఆగస్టులో ఆట మొదలెడతాం. ఆ లోగా ఆరోగ్యం మీద దృష్టి పెడతాను. ◆



అమ్మతో...

◆తెలుసా...?

❑ చారల గుర్రాలకు ఒళ్లంతా చారలుంటాయి, కానీ క్వాగా జాతి గుర్రాల్లో ముఖం, ముందు కాళ్ల పైభాగం వరకే చారలుంటాయి.

❑ రోమన్లు బంగారం బదులుగా తేనెను ఆదాయ పన్నుగా చెల్లించేవారు.

❑ ప్రపంచంలోని మొత్తం విమానాశ్రయాల సంఖ్య సుమారు 43,982.

❑ నీలి కళ్ళు ఉన్న తెల్ల పిల్లుల్లో సగం పైగా వాటికి చెవుడు ఉంటుందని పరిశోధనల్లో తేలింది.

❑ సిండ్రెల్లా, జాస్మిన్ లా డిస్నీ చిత్రాల్లోని రాజకుమార్తెలంతా 21 ఏళ్ళ లోపు వారే.

ప్రపంచంలోని మిలియనీర్లలో ఎనభై శాతం మంది సెకెండ్ హ్యాండ్ కార్లు వాడుతున్నారని ఓ సర్వేలో తేలిందట.

❑ షేక్‌స్పియర్ నాటకాల్లో ఎక్కువ సార్లు రిపీట్ అయిన విషయం ఆత్మహత్య. దాదాపు 13 నాటకాల్లో పలు పాత్రలు ఆత్మహత్య చేసుకుంటాయి.



❑ ప్రపంచంలోని అన్ని అణ్వాయుధాలను కలిపితే ఎంత శక్తి విడుదలవుతుందో అంత శక్తి హరికేన్ తుపాను పది నిమిషాల్లో విడుదల చేస్తుంది.

యుక్త వయసులో హిట్లర్ నటుడు కావాలని ఆశపడ్డాడు. రెండు సార్లు వియన్నా అకాడెమీకి దరఖాస్తు కూడా చేశాడు కానీ ప్రవేశం దక్కలేదు.



❑ అత్యంత అరుదైన నీలిరంగు పీతల్లో ఏది ఆడదో ఏది మగదో కనిపెట్టడం చాలా సులువు. ఆడపీతల పొట్ట భాగంలో అమెరికా పార్లమెంట్‌ను పోలిన గీతలుంటాయి.

❑ బట్టలను ఓ గంట సేపు ఇస్త్రీ చేస్తే మన ఒంట్లో సుమారు 161 క్యాలరీలు కరుగుతాయి.



❑ మొజాంబిక్ జాతీయ జెండాలో ఒక పుస్తకంపై ఏకే 47 బొమ్మ ఉంటుంది. ఏకే 47 ను జాతీయ జెండాపై పెట్టుకున్న దేశం అదొక్కటే.

WIKIPEDIA
The Free Encyclopedia

❑ ఇంగ్లీష్ వికీపీడియాలోని అన్ని వ్యాసాలు చదవడానికి పదిహేనేళ్ళకు పైనే పడుతుంది.

✦

◆ వింత లోకం

ఖరీదైన 'షి'కారు

ఆ కారు రోడెక్కితే చుట్టూ అంతా ధగధగలే. కారు సర్రున పోతుంటే పాదచారులు కళ్లార్పుకుంటూ చూస్తారట. సుమారు పది లక్షల స్వరోవ్‌స్కీ స్ఫటికాలను అద్దుకుంటే ఆ ఎఫెక్ట్ రాదా మరి. రష్యాకు చెందిన డేరియా రేడినోవా అనే యువతి ఈ కారు యజమాని. అతి ఖరీదైన పశ్చిమ లండన్‌లో జీవిస్తున్న ఈ అమ్మడిది వింతైన బాధ. చుట్టుపక్కలి అరబ్ షేక్ పిల్లలు చాలా ఖరీదైన రోల్స్ రాయిస్, ఫెర్రారీ, లంబోర్గిని కార్లలో దూసుకుపోతూ బడాయి చూపుతుంటే ఏం చేయాలా అని ఆలోచించిన ఈ అమ్మడికి ఈ ఐడియా తట్టింది. వెంటనే, తన ఖరీదైన మెర్సిడెస్ సీఎల్ఎస్ 350 కారుకు అదనంగా స్వరోవ్‌స్కీ క్రిస్టల్స్‌ను అద్దించి ముచ్చట తీర్చుకుంది. దీనికి ఆమెకు బాగానే ఖర్చయింది. అదే వీధిలో మరొకరి దగ్గర బంగారు తాపడం పెట్టించిన కారు ఉందట. డబ్బు ఏం చేసుకోవాలో తెలియనట్టుంది పాపం.

స్పూను కేవియర్ 70 వేలే!

ఈయన గారు వండి వార్చిన ప్రత్యేకమైన మత్స్యాహారాన్ని కాస్త రుచి చూడాలంటే వేల రూపాయల ఖర్చవుతుంది. అల్బినో చేప గుడ్లు, 22 కేరట్ల బంగారంతో రంగరించి తయారు చేసే ఈ కేవియర్ పేరు 'స్ట్రోటర్గ బియాన్కో'. ఆస్ట్రియాకు చెందిన చేపల రైతు వాల్టర్ గ్రూయెల్ దీన్ని తయారు చేసి తెల్ల బంగారమంటూ అమ్మేస్తున్నాడు. బాగా ధనవంతులు తప్పితే మరెవరూ కొనలేనంత ధర చెబుతున్నాడు. కేవియర్ అంటేనే ఖరీదెక్కువ. ఇతగాడి కేవియర్ అయితే ఒక టీ స్పూన్‌కు ఏకంగా సుమారు 70వేల రూపాయలు వసూలు చేస్తున్నాడు. కాస్పియన్ సముద్రంలో కనిపించే ఆల్బినో బెలుగా చేపలు చాలా వరకు అంతరించి పోయాయి. కొన్నింటిని వాల్టర్ ప్రత్యేకంగా పెంచుతున్నాడు. అందుకే వీటి కేవియర్‌కు అంత ఖరీదు.

అరుంధతీ 'గ్రామం'

అరుంధతి సినిమాలో హీరోయిన్ నెత్తిన కొబ్బరి కాయల్ని పగలుకొట్టే దృశ్యాన్ని చూసి జడుసుకున్నవాళ్లు బోలెడు మంది. సినిమా కాబట్టి ఏదో టెక్నిక్ వాడి అలా తీసుంటారులే అని ఊపిరి పీల్చుకుంటాం. కానీ, తమిళనాడులోని మెట్టు మహదానపురమనే గ్రామంలో జరిగే ఓ పండగను చూడ్డానికి వెళ్లారనుకోండి. ఊపిరి బిగపట్టాల్సిందే. తమిళల నెలైన ఆది మాసం రెండో మంగళవారం స్థానిక ఆలయంలో జరిగే తంతులో కొబ్బరి కాయల్ని భక్తులు తలపై పగలుగొట్టించుకుంటారు. ఒకరి తర్వాత ఒకరు వరసగా వస్తుంటే పూజార్లు టెంకాయల్ని వాళ్ల తలలపై పగలగొడుతుంటారు. 20 ఏళ్లు నిండిన వారెవరైనా ఇలా తలపై పగలుగొట్టించుకోవడానికి అర్హులే. దీనికోసం వందల మంది భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి వుంటారు. ఇది అత్యంత ప్రమాదకరమైన ఆచారమని వైద్యనిపుణులు, అధికారులు చెప్పినా వినడంలేదు.

కాబూలీవాలా

-రవీంద్రనాథ్ టాగూర్

మా అయిదేళ్ల పసిపాప మిని నోరు క్షణం మూత పడదు. ఎప్పుడూ వాగిందే వాగినట్లే వుంటుంది. మా ఇల్లు రోడ్డు పక్కనే వుంది. అందాకా 'కాళ్లా గజ్జ కంకాళమ్మ' ఆట ఆడుకుంటున్న మిని చివాలున లేచి కిటికీ దగ్గరకు వెళ్లి నిలబడి 'కాబూలీవాలా! ఓ కాబూలీవాలా!' అని బిగ్గరగా కేకలు పెడుతూ పిలుస్తోంది.
నల్లగా మాసి, మురికి తోలు అయిన వదులొదులు చొక్కా, పైజమా, పెద్ద తల పాగా ధరించి, ఆజానుబాహువు అయిన కాబూలీవాడొకడు రెండు చేతుల్లో రెండు ద్రాక్షపళ్ల పెట్టెలు, భుజానికి ఎండుద్రాక్ష, బాదంపప్పులతో నిండిన సంచి తగిలించుకుని, ఆ రోడ్డుమీద నుంచి మెల్లగా నడిచి వెళ్తున్నాడు. అతనిని చూడగానే మా మిని హృదయంలో, ఏం భావాలు వుత్పన్నమయ్యాయో ఏమో, నాకైతే తెలియదు. కానీ మిని ఆ కాబూలీవాలాను మాత్రం బిగ్గరగా కేకలు వేస్తూ పిలుస్తోంది.

మిని కేకలు విని ఆ కాబూలీవాలా నవ్వుతూ దాని కేసిచూచి చరచరా ఇంట్లోకి వచ్చేస్తున్నాడు. కానీ ఇంట్లోకి వస్తున్న ఆ కాబూలీవాలాను చూడడంతోటే తనను పట్టుకపోతాడన్న భయంతో ప్రాణాలు బిగబట్టుకుని మిని లోనికి పారిపోయింది. అంతే. మళ్లీ కంటికి కనిపించలేదు. గప్‌చిప్ సాంబారుబుడ్డిలాగా దాక్కొంది ఎక్కడో.

బజారులోంచి కాబూలీవాలా నవ్వుతూ వచ్చి నాకు సలాము చేసి నిలుచున్నాడు. ఆ మనిషిని తీరా ఇంట్లోకి పిలిచి, ఏమీ కొనకుండా ఊరికే తిప్పి పంపడం మర్యాద కాదనిపించింది. అందుకని ఏవో కొద్దిగా కొన్నాం. చివరకు అతను లేచి వెళ్లిపోబోతూ "బాబుగారూ, తమ పాపాయి ఎక్కడుంది?" అడిగాడు వచ్చీ రాని పరాయి భాషలో. దాని హృదయంలో వుత్పన్నమైన భయాన్ని తొలగిద్దామన్న అభిప్రాయంతో లోపలనుంచి మినీని పిలిపించాను. అది నన్ను కరచుకుని, కాబూలీవాలా ముఖంవైపు, అతని సంచివైపు అదేపనిగా అనుమానంగా చూస్తూ నిలబడింది. కాబూలీవాలా తన సంచిలోంచి ఇంత బాదంపప్పు, ఎండుద్రాక్ష తీసి మిని కివ్వబోయాడు. కాని వాటిని తీసుకోవడానికి భయపడింది. దాని అనుమానం మరీ ఎక్కువైంది. ఇక అది నా మోకాళ్లను వదలకుండా చుట్టేసుకుంది. అలా ప్రారంభమైంది వారి తొలి పరిచయం.

ఒకనాడు ఏదో అవసరమైన పనుండి పొద్దున్నే బజారుకు బయలుదేరాను. వాకిట్లోకి వచ్చి చూచేసరికి మా అమ్మాయి మిని ఇంటిముందర అరుగుల మీద కూర్చొని ఆ కాబూలీవాలాతో జోరుగా మాట్లాడేస్తోంది. ఆ కాబూలీవాలా దాని కాళ్ల ముందర కూర్చొని చిరునవ్వులతో దాని మాటలను బహు ఓపిగ్గా ఆలకిస్తున్నాడు. అప్పుడప్పుడు సందర్భాన్ని బట్టి అతను తనకు వచ్చీ రాని పరాయి భాషలో మిని మాటల మీద తన అభిప్రాయాలను కూడా వ్యక్త పరుస్తున్నాడు. తను పుట్టి బుద్దెరిగిన తర్వాత మినీకి ఈ అయిదు సంవత్సరాలలో దాని మాటలను అంత ఓపికతో ఆలకించేవాడు 'తండ్రినైన' నేను తప్ప బహుశా మరెవ్వరూ ఆలకించి వుండరు. దాని బుల్లి పరికిణీ కేసి చూశాను. దాని నిండా బాదంపప్పు, కిస్‌మిస్ పళ్లు వున్నాయి. జేబులోంచి అర్ధరూపాయి బిళ్ల తీసిస్తూ "దానికవన్నీ ఎందుకిచ్చావ్? ఇక ముందెప్పుడూ అలా ఇవ్వకు" అన్నాను ఆ కాబూలీవాలాతో. అతను మాట్లాడకుండా ఆ అర్ధరూపాయి తీసుకుని జేబులో వేసేసుకున్నాడు. ఆ కాబూలీవాలాను మినీ కలుసుకోవడం ఇది రెండవ సారి మాత్రమే కాదని తెలిసింది.

ఈలోపున ఆ కాబూలీవాలా రోజూ మాయింటికి వచ్చిపోతూ మినీకి బాదంపప్పు, కిస్‌మిస్ పండ్లు లంచమిచ్చి దాని పసి హృదయాన్ని ఆకర్షించి లోబరుచుకున్నాడు. వాళ్లిద్దరూ రోజూ సరదాగా మాట్లాడుకుంటుంటారు. రహమత్‌ను చూడగానే మా మిని నవ్వుతూ "కాబూలీవాలా! కాబూలీవాలా! నీ సంచి లోపల ఏం వుంది" అని అడుగుతుంది.

రహమత్ చిరునవ్వు నవ్వుతూ వేళాకోళంగా 'ఏనుగు' అనేవాడు. అది విని మిని పకపక నవ్వేది. రహమత్ కూడా నవ్వేవాడు. ఒకరు బాగా వయస్సు ముదిరిన వ్యక్తి. ఇంకొకరిది అమాయక పసి హృదయం. శరత్కాల ప్రభాతవేళ వారిద్దరి మధ్య జరుగుతున్న ఆ స్నిగ్ధ సరళ హాస పరిహాసాలు వింటానికి నాకు సరదాగానే వుండేది.

అంతేకాదు, వారిద్దరి మధ్య రోజూ ఇంకోమాట అనుకోవడం కూడా మామూలైంది. "మినీ నువ్వు అసలు అత్తవారింటికి వెళ్లకు. అవును, వెళ్లవుకదూ!" అనేవాడు మినీతో రహమత్.

మన దేశంలోని బాలికలు పుట్టినప్పటి నుండి "అత్తవారిల్లు" అన్న పదం తెలిసుంటుంది. కాని మేము ఆధునిక నవయుగ వాతావరణానికి అలవాటుపడ్డవాళ్లం కనుక మా అమ్మాయికి అత్తవారింటి విషయాల్ని గురించి చెప్పలేదింకా. అందువల్ల రహమత్ అంటున్న ఆ పదాల భావం మినీ కసలు తెలిసేది కాదు. కాని ఆ విషయాన్ని గురించి దానికసలు తెలియకపోయినా ఆ మాటలకు తిరిగి జవాబు చెప్పకుండా వూరుకోవడం మిని స్వభావానికి కేవలం విరుద్ధం. అందుచేత మిని తిరిగి ఎదురు ప్రశ్న వేస్తూ "నువ్వు వెళతావా అత్తవారింటికి" అని అడిగేది రహమత్‌ను. ఊహాజనితమైన ఆ 'అత్త'ను కొట్టి చంపబోతున్న వాడిలా తన బలమైన పిడికిలి బిగించి పైకి ఎత్తి "ఊ, ఇదిగో చూడు. దీనితో మా అత్తను కొట్టి చంపేస్తాను" అనేవాడు రహమత్.

కాలచక్రం గబగబా తిరిగిపోతోంది. నేను కలకత్తా వదిలి బయటకు వెళ్లి ఎరుగను. నూతిలోని కప్పలాగా ఇక నాకు మా ఇల్లే సకల ప్రపంచం. ఇల్లొదిలి బయటికి రావడమంటే నాకు తల నొప్పి. అందుచేతనే పొద్దుటిపూట నా గదిలో టేబుల్ ముందర కూర్చొని ఆ కాబూలీవాలా చెపుతున్న లెక్చర్లు వింటూ దేశాటన కార్యక్రమానికి సంబంధించినంత వరకు కుతి తీర్చుకుంటుండే వాడిని.

విదేశీయులతో వచ్చీరాని పరాయి భాషలో మేఘ గర్జన స్వరంతో మాట్లాడే కాబూలీల మాటల తీరులను గురించీ, కాబూలీవాలా ముఖతా వింటున్నంతసేపు కాబూల్ దేశపు సజీవదృశ్యం. నా కళ్లకు కట్టినట్లుండేది.

మిని తల్లి వట్టి పిరికి మనిషి. బజార్లో కాస్త గొడవ జరిగిందంటే సరి, లోకంలో తాగితందనాలాడే తాగుబోతులంతా ఇక మా యింటిమీదికే వస్తున్నారని అనుకుంటుంది. ముఖ్యంగా కాబూలీవాలా రహమత్‌ను గురించి ఆమెకు కొన్ని సందేహాలు వున్నాయి. అందువల్ల వానిమీద కాస్త కన్నేసి వుంచమని నాతో పదేపదే అంటూ వుంటుంది. నేనామె సందేహాన్ని నవ్వులాటకింద తోసి పుచ్చేవాడిని. కాని అలాంటప్పుడు ఆమె వూరుకునేది కాదు. కాబూలీలు పిల్లల్ని ఎత్తుకుపోరా? కాబూల్‌లో పిల్లలను అమ్మటంలా?రాకాసంతటి ఆ కాబూలీ వాడికి చిన్న పిల్లల్ని మాయచేసి ఎత్తుకుపోవడం ఒక లెక్కా? అని నా మీద ఇలా ఎన్నో ప్రశ్నల వర్షం కురిపించేది.

ఆమె అలా అనుమానించడంలో కూడా కొంత యదార్థం లేకపోలేదని చివరకు నేను అంగీకరించక తప్పలేదు. కాని అది నమ్మదగ్గ విషయం కాదు. నమ్మగలిగిన శక్తి అందరిలో ఒకే మాదిరిగా వుండదు. అందుచేత నా భార్యలో ఆ భయం అలాగే వుండిపోయింది. కాని కేవలం అనవసరంగా కలిగిన భయంతో నిర్దోషి అయిన రహమత్‌ను మా ఇంటికి రావద్దనలేకపోయాను.

ప్రతి సంవత్సరం మాఘమాసంలో రహమత్ స్వదేశానికి వెళ్తుంటాడు. ఇక ఆ రోజుల్లో తన ఖాతాదార్ల నుండి రావలసిన అప్పులు వసూలు చేసుకోవడంలో అతనికి బొత్తిగా తీరికే వుండేది కాదు. ఇల్లిల్లు తిరగాల్సి వచ్చేది. కాని ఆ పరిస్థితుల్లో కూడా అతను ఎప్పుడో ఒకప్పుడు కాస్త వీలు చూసుకుని మినీని పలకరించి పోతుంటాడు. చూసేవాళ్లకు వాళ్లిద్దరూ ఏదో కుట్ర పన్నుతున్నారనిపిస్తుంది. ఒక్కొక్కనాడు తీరిక చిక్కక పొద్దుటిపూట రాలేకపోతే ఆఖరికి సాయంత్రం మా ఇంట్లో తప్పక హాజరయ్యేవాడు. వదులు చొక్కా పయిజమా ధరించి భుజానికి సంచులు తగిలించుకుని చీకట్లో ఇంటిమూలన కూర్చుని వుండగా దీర్ఘకాయుడైన ఆ కాబూలీవాలాను అదాటున చూచినవారు నిజంగానే భయపడతారు.

కాని కాబూలీవాలా కనిపించడంతోటే మిని 'కాబూలీవాలా! ఓ కాబూలీవాలా! అని కేకలేసుకుంటూ నవ్వులు, కేరింతలతో అతని దగ్గరకు పరుగెత్తుతుంది. ఈడు జోడు కాని ఆ ఇద్దరి మిత్రుల మధ్య చెలరేగుతున్న వారి ఆ నవ్వులు, కేరింతలకు ఆనందంతో నా మేను పులకరిస్తుంది.

ఒక రోజు పొద్దునే నేను నా గదిలో కూర్చుని నా నూతన గ్రంథపు ప్రూఫులు దిద్దుకుంటున్నాను. వెళ్లిపోతున్నానని కాబోలు నాలుగు మూడు రోజుల నుండి చలి ఎముకలు కొరికేస్తోంది. శరీరంలో గజగజ వణుకొస్తోంది. కాళ్లు చేతులు కొంగర్లు పోతున్నాయి. కిటికీలోంచి పొద్దుపొడుపు ఎండ టేబిల్ కింద వున్న నా పాదాలమీద వచ్చి పడుతోంది. ఆ సూర్యకిరణాల గోరువెచ్చని వేడి హాయిని ప్రసాదిస్తోంది. సుమారు ఎనిమిది గంటలై వుంటుంది. మఫ్లర్లు మెడకు చుట్టుకుని ప్రాతఃకాలం వాహ్యాళికి వెళ్లిన ఉషాచరణం ఇళ్లకు తిరిగొస్తోంది. సరిగ్గా ఆ సమయానికి నడిరోడ్డుమీద గల్లంతేదో జరుగుతున్నట్లు పెద్ద పెద్ద కేకలు,పెడ బొబ్బలు వినిపించాయి. దర్వాజా దగ్గర నిలబడి చూద్దును గదా. కాబూలీవాలా రహమత్‌ను ఇద్దరు పోలీసువాళ్లు పట్టుకుని తీసుకొస్తున్నారు. వారి వెనుక కుర్రవాళ్లమూక కుతూహలంతో పరుగెత్తుకొస్తోంది. రహమత్ చొక్కా అంతా రక్తంతో తడిసిపోయింది. పక్కన వస్తున్న కానిస్టేబుల్ చేతిలో రక్తం వడుస్తున్న కత్తి వుంది. నేను ఇంట్లోంచి బజార్లోకి వచ్చి పోలీసులను ఆపి "విషయం ఏమిటి?" అని అడిగాను.

మా పొరుగింటి ఆసామి ఒకరు రహమత్ వద్ద రాంపూర్ శాలువా కొని పైకం మొత్తం ఇవ్వకుండా ఇంకా కొంత బాకీ వుంచాడని, ఇప్పుడు రహమత్ ఆ బాకీ అడిగితే నే నెరుగను పొమ్మన్నాడని, దానిమీద మాటకు మాట ముదిరి రహమత్ ఆ ఆసామిని కత్తితో పొడిచాడని, కొంత పోలీసుల ముఖతా, కొంత రహమత్ ముఖతా విన్నాను.

రహమత్ తన బాకీదారును, నోట అనకూడని తిట్లన్నీ తిడుతున్నాడు. ఇంతలో 'కాబూలీవాలా, ఓ కాబూలీవాలా!' అని అరచుకుంటూ మిని ఇంట్లోంచి బయటకు వచ్చింది.

రహమత్ ముఖం ఆ క్షణం ఆనంద రేఖతో విప్పారింది. అతని భుజానికి ఇవాళ సంచి లేదు. అందువల్ల సంచిని గురించిన ఆ ఇద్దరి మిత్రుల నిత్య హాస్యాలాపనలకు అవకాశం లేకపోయింది. మిని తడుముకోకుండా "నువ్వు అత్తవారింటికి వెళతావా" అని అడిగేసింది.

రహమత్ "అవును,

అక్కడికే వెళుతున్నావా!"

తనిచ్చిన ఆ సమాధానం మినీని సంతృప్తి పరచలేకపోయిందని గ్రహించాడు రహమత్. అప్పుడిక చేతులు చూపిస్తూ "అత్తను చంపేసేవాడినే, కాని ఏం చేయను. చేతులు కట్టేశారు" అన్నాడు.

కత్తి విసిరాడన్న నేరంమీద రహమత్‌కు దీర్ఘకాల శిక్ష విధించబడింది.

ఆ కాబూలీవాలా క్రమక్రమంగా మా స్మృతి పథం లోంచి తొలగిపోతున్నాడు. కాదు, మేమే బొత్తిగా మరచిపోయాం. మా యింట్లో హాయిగా కాలక్షేపం చేస్తున్న మాకు కొండల మీద నిర్భయంగా విహరించవలసిన ఆ స్వేచ్ఛాజీవి అలా నాలుగు గోడల మధ్య ఇంకా జైలులో మగ్గుతున్నట్లు అసలు స్ఫురణకే రాలేదు.

ఇక చంచల హృదయిని మిని అంతలో ఆ కాబూలీవాలాను ఎలా మరిచిపోగలిగిందో చూస్తే నాకే ఆశ్చర్యం వేసింది. ఇప్పుడు అది తన పాత స్నేహితుడ్ని పూర్తిగా మర్చిపోయింది. కాబూలీవాలా జైలుకెళ్లాక మా నౌకరు నబీతో కొన్నాళ్లు ఆడుకుంది. ఇక క్రమక్రమంగా దానికి వయసు వస్తున్నకొద్దీ మగ పిల్లలను వదిలేసి తన యీడు ఆడపిల్లల జట్టును కూడ గట్టింది. అంతేకాదు మిని దర్శన భాగ్యం రాను రాను చివరకు కన్నతండ్రినైన నాకే దుర్లభమైంది. ఒక రకంగా మినీతో నా సంబంధం పూర్తిగా తెగిపోయిందనే చెప్పొచ్చు.

అనంత కాలవాహినిలో కొన్ని సంవత్సరాలు దొర్లిపోయాయి. అది శరత్కాలం. మిని పెళ్లి నిశ్చయమైంది. మా యింటిని నిత్యానందంతో కళకళలాడించే ఆనందమయి మా మినికూడా పుట్టింటిని అంధకారంలో ముంచి కైలాసవాసిని పార్వతిలాగా ఇక అత్తామామలింటికి వెళ్లిపోబోతోంది.

బాలభానుని ప్రాతఃకిరణాలు అతి మనోహరంగా ప్రకాశిస్తున్నాయి. వర్షంనీటితో కడిగి శుభ్రం చేయబడిన శరత్కాల బాలార్కుని, ఆ తొలిఎండలు వెలిగార మద్దిన బంగారం వలె స్వర్ణకాంతులీనుతున్నాయి. అవి వెదజల్లుతున్న అనుపమ లావణ్యానికి శోభాయమానమైన ప్రకృతి మిలమిల మెరుస్తోంది.

ఇవాళ తెల్లవారుఝాము నుంచి మా ఇంట్లో సన్నాయి మోగుతుంది. సన్నాయి గొట్టంలోంచి వినిపిస్తున్న కరుణా పూరితమైన ఆ భైరవిరాగం నా హృదయాంతరాళపు, మూగ వేదనను సమీపిస్తున్న హృదయ విదారకమైన మా ఎడబాటును శరత్కాల లేత ఎండలతో పాటు అనంత విశ్వంలో వ్యాపింపచేస్తున్నది.

అది మా మిని పెళ్లిరోజు. పొద్దుటి నుంచీ ఇంట్లో చాలా హడావిడిగా వుంది. చుట్టాలు, పక్కాలు వస్తున్నారు. ఇంటి ముందర పందిట్లో పెళ్లి మండపం కడుతున్నారు. హాలు, వరండా అంతా పచ్చని మామిడి తోరణాలతో అలంకరించబడుతోంది. ఊ కానీయండి. అదిగో అటుతిప్పి తీసుకురాండి. లగ్నం సమీపిస్తోంది. తొందర చేయండి. చూస్తారేం కానీయండయ్యా, అన్న కేకలు వినిపిస్తున్నాయి నా గదిలోకి.. పెళ్లి ఖర్చుల జాబితా వేసుకుంటూ, నా గదిలో కూర్చున్నాను. ఇంతలో రహమత్ వచ్చి సలాము చేసి నిలబడ్డాడు.

నేనసలు అతన్ని గుర్తుపట్టలేకపోయాను. వెనుకటిలాగా అతని భుజానికి ఇప్పుడా సంచిలేదు. నెత్తిమీద వుంగరాలు తిరిగిన ఆ జులపాలూ లేవు. ముఖంలో మునుపటి ఆ కళా లేదు. చివరకు చిరునవ్వును బట్టి అతను రహమత్ అని గుర్తుపట్టగలిగాను.

"ఏం రహమత్ ఎప్పుడొచ్చావ్?"

"నిన్న సాయంత్రమే జైలు నుంచి విడుదలయ్యాను"

అతని మాటలు నన్ను తీవ్రంగా వేధించాయి. ఖూనీ కోరుతో ఇంతవరకు ఎన్నడూ మాట్లాడి ఎరుగను. వానిని చూడడంతోనే నా హృదయం గడ్డకట్టుకపోయింది. ఇవాళ ఈ శుభదినం నాడు ఈ మనిషి ఇక్కడి నుండి వెళ్లిపోతే బాగుండుననిపించింది.

కాబూలీవాలాతో "ఇవాళ మా ఇంట్లో కాస్త అవసరమైన కార్యం ఉంది. తొందరపనిలో వున్నాను. అందువల్ల ఇప్పుడు నీతో మాట్లాడడానికి తీరిక లేదు. మళ్లీ ఇంకోనాడురా" అని అన్నాను.

నా మాటలు విని అతను వెంటనే తిరిగి పోసాగాడు. కాని దర్వాజా దాకా వెళ్లి కాస్త ఇటుఅటుచూసి "పాపను ఒకసారి చూపించరూ?" అని అడిగాడు.

పాపం. మిని మునుపటిలాగే ఇంకా పసిపాపగానే వుందని అతని విశ్వాసం కాబోలు. మిని పూర్వంలాగా ఇప్పుడు కూడా 'కాబూలీవాలా!' ఓ కాబూలీవాలా!'అని అరుచుకుంటూ తన దగ్గరికి పరుగెత్తి వస్తుందని, మునుపటిలాగనే నవ్వులు కేరింతలతో ఆడుకోవచ్చని అనుకుంటున్నట్లున్నాడు. అంతే కాదు మునుపటి స్నేహానికి స్మృతి చిహ్నంగా ఒక ద్రాక్షపళ్ల గుత్తి, ఒక కాగితంలో ఇన్ని కిస్‌మిస్‌పళ్లు, బాదంపప్పులు పొట్లం కట్టుకుని తీసుకొచ్చాడు. సంచి దగ్గర లేదు. బహుశా వాళ్ల దేశస్తుడెవరినో అడిగి తెచ్చుంటాడు.

"ఇవాళ ఇంట్లో చాలా పనులున్నాయి. ఎవరినీ చూడ్డానికి వీలుండదు" అని జవాబిచ్చాను.

నా జవాబు విని రహమత్ విచారంతో మిన్నకుండిపోయాడు. నిరాశతో ఒక్కసారి నా వైపు చూశాడు. "సలామ్ బాబూ" అంటూ బరువుగా గడప దిగి బజార్లోకి వెళ్లాడు.

✦

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం 'స్నేహ' మీ కథలకు ఆహ్వానం పలుకుతోంది.

సూచనలు

- కథలకు సమకాలీన పరిణామాలు, పరిస్థితులు నేపథ్యంగా ఉండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు.
- ప్రతికూల పరిస్థితిని ఎదిరించి నిలిచే/ గెలిచే కథలకే ప్రాధాన్యం ఉంటుంది. అభ్యుదయ దృక్పథంతో, సామాజిక చైతన్యాన్ని ప్రోత్సహించేలా వుండాలి.
- మూఢనమ్మకాలను పెంచేదిగాకానీ, ఏ తరగతిని నొప్పించేదిగాకానీ వుండకూడదు.
- మాండలికాలను ఉపయోగించినా కథా శైలి అందరికీ బోధపడేలా వుండాలి.
- నవ్యత, వైవిధ్యం కలిగి ఇప్పటి వరకు స్పృశించని కోణాలను ప్రతిబింబించే కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

- కథ నిడివి ప్రింటులో మూడు ఏ 3 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 6 నుంచి 8 పేజీలు వుండాలి.
- ప్రింటయినా, చేతిరాతయినా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండాలి.
- రచయిత/ రచయిత్రి పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు, ఈ మెయిల్ ఐడి వేరే కాగితం మీద రాసి జత చేయాలి. హామీపత్రం విధిగా జత చేయాలి.
- రచన స్థాయిని బట్టి పారితోషికం వుంటుంది.
- రచనలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1, ఆజామాబాద్, హైదరాబాద్-500020. మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

నవ్వుల్ – పువ్వుల్

ఒకే ప్రశ్న

రైల్వే స్టేషన్‌లలో, బస్టాండ్‌లో ఇద్దరు బిచ్చగాళ్ళు కలిసినా ఇద్దరు సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు కలిసినా అడిగేది ఒకే ప్రశ్న. ఏంటదీ?

“ నీది ఏ ప్లాట్ ఫాం”

షికారు

ఇద్దరు అమాయకులు మాట్లాడుకొంటున్నారు

ఒకడు: నిన్న మా గడియారం పోయిందిరా?

రెండోవాడు: తిరిగేదే పోయిందా? లేక పాడయినదా?

ఒకటోవాడు: తిరిగేది పోయిందిరా?

రెండోవాడు: బోరు కొట్టి ఎక్కడికైనా షికారు తిరగటానికి వెళ్లిందేమో! కంగారుపడకు! అదే వస్తుంది.

ఇంగ్లీషులో చెప్పు

పిల్లల్ని పరిచయం చేసుకుంటున్నారు కొత్త మాస్టారు

మాస్టారు: ఒరేయ్ నీ పేరు, మీనాన్న పేరు చెప్పరా..

విద్యార్థి: నా పేరు చిట్టిబాబు, మానాన్న పేరు సూర్యప్రకాశ్

మాస్టారు: ఏదీ దీన్ని ఇంగ్లీషులో చెప్పు చూద్దాం

విద్యార్థి: నా పేరు లిటిల్ బాయ్, మానాన్న పేరు సన్‌లైట్...

ఆరు కాళ్లా?



అధ్యాపకుడు: రవీ! మంచానికి కాళ్ళెన్నిరా?

రవి (గొప్పగా): ఆరు సార్!

అధ్యాపకుడు: అదెలారా?

రవి: మరి దానిపై నేను పడుకుంటాగా?

తోక లాగేస్తా.!

తండ్రి: ఏరా వెధవా! మన టామీనెందుకలా ఏడిపిస్తావ్! ఈసారి దాని ముక్కు పట్టుకు లాగావో, నీ ముక్కు పిండేస్తా! దాని కాలు పట్టుకులాగావో, కాలు విరగొడ్తతా! దాని చెవి పట్టుకులాగావో నీ చెవులు మెలిపెట్టెస్తా! జాగ్రత్త..

కొడుకు: మరి దాని తోక లాగితే...

పేరేంటి

చింటు : డాడీ ఈ రోజు మా కాలేజీకి కొత్త లెక్చరర్ వచ్చారు

తండ్రి: అలాగా... ఆయన పేరేంటి?

చింటు: ఇంకా ఆయనకు మేం పేరు పెట్టలేదు డాడీ!

చంద్రుడిపైకి

మాష్టారు: పిల్లలూ! మీకు చంద్రునిపైకి వెళ్ళాలని ఉందా?

చంద్రుడు మహా అందంగా ఉంటాడు?

పిల్లలు: ముందు ఇది చెప్పండి! అక్కడ స్కూల్ ఏమి లేదు కదా!

పక్కింటి కుక్క

ఇంటికో పెద్దాయన వచ్చారు ఇంటి ముందున్న కుక్కని చూశారు.

పెద్దాయన: మీ కుక్క కరుస్తుందా?

ఇంటాయన (గొప్పగా): మా కుక్క అస్సలు కరవదండీ!

పెద్దాయన (అరుస్తూ): మీ కుక్క కరవదన్నారుగా! మరి కరిచిందేం?

ఇంటాయన: నేను రైటే చెప్పాను. ఇది పక్కింటాయన కుక్క.

అనుభవం

సాటి రచయిత: మొన్న ఒక పత్రికలో మీ కథ చదివాను నా కంటే మీరు చిన్న వారైనా అనుభవం మాత్రం పెద్దది

తోటి రచయిత: ఏం అలా అంటున్నారు?

సాటి రచయిత: ఏం లేదు. నేను ముప్పై సంవత్సరాల నాటికథలు కాపీ కొడితే మీరు ఏభై సంవత్సరాల నాటి కథలు కాపీ కొడుతున్నారు!

◆ చూద్దామా

ఓ కుటుంబం.. ఒక కారు.. 12 దేశాలు..

కొందరికి విహారమంటే ప్రాణం. దైనందిన వత్తిళ్లకు తాత్కాలిక విరామం పలికి... స్వేచ్ఛా విహంగాల్లా సుందర ప్రదేశాలను చుట్టిరావాలని... పురాతన కట్టడాలను తనివితీరా సందర్శించాలని... ఆయా ప్రాంతాల్లో ప్రజల జీవనశైలిని నిశితంగా గమనించాలని ... మరో ఏడాదికి సరిపడా నూతనోత్తేజాన్ని హృదయం నిండా నింపుకోవాలని... తెగ ఉబలాటపడిపోతుంటారు. అన్నిటికీ అనువుగా వుండే వేసవి సెలవుల కోసం ఏడాదంతా ఎదురు చూస్తుంటారు. అలాంటి వారిలో మీరూ వుంటే ... ఇప్పటికే ప్రయాణ ప్రణాళిక సిద్ధం చేసేసుకుంటే... తప్పక కలుసుకోవాల్సిన కుటుంబం ఒకటుంది. బెంగళూరుకు చెందిన ఈ కుటుంబం ఇటీవలే ప్యారిస్‌కు కారులో బయల్దేరింది. 100 రోజుల్లో 15,000 కిలోమీటర్లు ప్రయాణించి గమ్యస్థానం చేరాలన్నది లక్ష్యం.

బెంగళూరుకు చెందిన ఆనంద్‌ది చిన్ని కుటుంబం. భార్య పునీత. పిల్లలు యష్, ధృతి. అంతే. ఆ... అన్నట్టు వారి ఫియట్ కారుని మర్చిపోయాం. దీనికి కూడా ఆ కుటుంబంలో కీలకమైన స్థానమే వుందండోయ్! మరి ఆ నలుగురిని అంత దూరం అలుపు సొలుపూ లేకుండా తీసుకెళ్లేది అదే కదా. ఇక పరిచయ కార్యక్రమం. ఆనంద్ 'డ్రీమ్‌వర్క్స్ యానిమేషన్'లో యానిమేటర్. పిల్లలిద్దరూ 'డీన్స్ అకాడమీ'లో చదువుకుంటున్నారు. ప్రిన్సిపాల్ ప్రత్యేక అనుమతితో వారీ కారులో పన్నెండు దేశాల్లో షికారుకు బయల్దేరారు. భార్యాభర్తలిద్దరికీ డ్రైవింగ్ వచ్చు కనక అన్ని వేల కిలోమీటర్ల ప్రయాణం పెద్ద కష్టం కాకపోవచ్చు. నేపాల్, చైనా, కిర్గిస్తాన్, ఉజ్బెకిస్తాన్, టర్క్‌మెనిస్తాన్, ఇరాన్, టర్కీ, గ్రీస్, ఇటలీ, స్విట్జర్లాండ్, స్పెయిన్ ... ఆఖరికి ఫ్రాన్స్ చూడబోతున్నారు. వీరి ప్రయాణానికి బంధుమిత్రులే కాక పది వరకు సంస్థలు కూడా సాయం చేయడానికి ముందుకొచ్చాయి.

సర్వం సన్నద్ధం

అతి తక్కువ బట్టలు, సాధ్యమైనంత ఎక్కువ ఆహార పదార్థాలతో కారు నింపేశారు. ధృతికి కొత్త భాష నేర్చుకోవాలన్న కుతూహలం ఎక్కువ. దాంతో తాము చూడబోయే దేశాల మాతృభాషను కొద్దిగా నేర్చుకుంది. పైగా తనకెంతో



ఇష్టమైన స్విమ్ సూట్‌ను కూడా వెంట బెట్టుకుంది. ఫ్యాషన్ డిజైనర్ కావాలనుకుంటున్న ఆ పాప పారిస్‌లో షాపింగ్ చేయాలనుకుంటోంది. ఇక దారిలో కాలక్షేపం కోసం ఆడుకోవడానికి కొన్ని రకాల గేమ్స్‌ను కూడా తీసుకెళ్తున్నారు. యష్‌కు ఫుట్‌బాల్ ఆట అంటే చాలా ఇష్టం. సరైన సమయానికి బార్సిలోనా వెళ్తే మాత్రం నైమార్ జూనియర్ ఆడే మేచ్ చూడాలని ఆశపడుతున్నాడు. అంతేకాదు! మేప్ చూసి వెళ్లాల్సిన రూట్ వివరాలు చెప్పండంలో యష్ మంచి నేర్పరి. అనుభవజ్ఞుల్లా చిటికెలో గుడారం వేసేస్తాడంటే నమ్మబుద్ధి కాదు.

ఐడియా వచ్చిందిలా!

నిజానికి ఇలా కారులో పారిస్ వెళ్లాలన్న ఆలోచన అనుకోకుండా వచ్చింది. పైగా ఆనంద్ కుటుంబానికి ఇదే తొలి ప్రయాణం కాదు. క్రిస్టమస్ సెలవుల సందర్భంగా వారు

అమెరికాలో నాలుగు నెలలున్నారు ఒకసారి. తిరిగి ఇండియా వచ్చాక... మంగళూర్ నుంచి రాజస్థాన్ ప్రయాణం పెట్టుకున్నారు. అప్పుడు కూడా కుటుంబ సమేతంగా కారులో వెళ్లారు. అదీ ... మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు చుట్టాలన్నది వారి ప్లాన్. మొత్తం 5 వేల కిలోమీటర్ల దూరం. ఆ సందర్భంగానే... "2020లో చేయనున్న ప్రపంచ యాత్రలో భాగమే ఈ ప్రయాణం'. అన్నాడు ఆనంద్. విపరీతంగా ఆలోచించి అన్న మాటలు కావవి. యథాలాపంగా మనసుకు తోచింది పైకి అనేశాడంతే. ఆ మాటలను సీరియస్‌గా తీసుకోకపోయినా పిల్లలు, భార్య ఓకే చెప్పేశారు సంతోషంగా. పైగా ఆనంద్‌కు ప్రపంచం అంతా చుట్టి రావాలని కోరిక. అదీ పిల్లలు పెరిగి పెద్దవారు కాకముందే చేసేయాలని అతని మనసులో బలంగా వుంది.

ఎనిమిది నెలల కష్టం

అప్పటి నుంచి ఆనంద్ యాత్రా స్పెషల్స్ చదవడం మొదలెట్టాడు. తమలాగా సొంత వాహనాల్లో విదేశాలు సందర్శించిన వారితో సంభాషించసాగాడు. అందుకోసం ఏడేళ్లగా చేస్తున్న యానిమేటర్ జాబ్‌కి బైబై చెప్పేశాడు. ఎనిమిది నెలల్లో ... 2,500 ఈమెయిళ్ల ద్వారా తాము పయనించాలనుకున్న దేశాలు...అక్కడి దర్శనీయ స్థలాలు, బస చేయదగిన హోటళ్ల గురించిన సమాచారం సేకరించి సర్వం సిద్ధం చేసేశాడు. అయితే ఈ విషయం తెలిసిన సమీప బంధువులు కొందరు కనీసం పిల్లలనైనా తమ దగ్గర విడిచిపెట్టమని సలహా ఇచ్చినా...అందరూ కలిసే ప్రయాణం చేయాలనుకున్నామని సున్నితంగానే వారి ఆహ్వానాన్ని తిరస్కరించారు.

వీలుంటే స్వయం పాకమే!

వీరికంటే ముందు కారుల్లో, బైకు మీద ఇలా విదేశాలు వెళ్లిన వారున్నప్పటికీ ... పిల్లలతో ప్రయాణిస్తున్నది మాత్రం వీరే. పూర్తిగా శాఖాహారులు కావడం మరింత ప్రత్యేకం. ఎందుకంటే విదేశాల్లో ముక్కల్లేని ఆహారం ఎల్లవేళలా అందుబాటులో వుంటుందన్న గ్యారంటీ లేదు. అందుకే మార్గ మధ్యలో వీలు దొరికిన చోట కారు ఆపి వంట చేసుకుంటారు. అందుకవసరమైన సరంజామా అంతా కారులో సర్దుకున్నారు. ప్రయాణానికి ముందే నలుగురూ వైద్యులను కలిసి సలహాలు తీసుకున్నారు. వారి సూచన మేరకు కొన్ని రకాల మందులు వెంటబెట్టుకున్నారు.

ఇదో సాహస యాత్ర

"మేం విభిన్న ప్రాంతాలను, అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించాలని... ప్రజలను కలుసుకోవాలని అనుకుంటున్నాం. వాళ్లు మా కథ విని ... మమ్మల్ని ఆహ్వానించి ఆతిథ్యం ఇస్తారనుకుంటున్నాం. భాషే కొద్దిగా ఇబ్బంది. అంతా ఉత్కంఠభరితంగా వుంది. మొత్తం మీద ఇదో సాహస యాత్ర" అంటాడు ఆనంద్ ఉత్సాహంగా. "మాకు మొదటి నుంచి ఎలాంటి ఎజెండాలు లేవు. ఆ దేశాలకెళ్లి చూసి ... ఆనందించాలనుకుంటున్నాం..అంతే!' అంటుంది పునీత సింపుల్‌గా.

అయితే వారు ఏదైనా ఒక ప్రదేశానికి మరో రెండు వారాల్లో చేరుకుంటామనగానే... అక్కడి హోటళ్లలో గదులు బుక్ చేసుకుంటున్నారు. పైగా గుడారం వేసుకోవడానికి కావాల్సిన సరంజామా కూడా వెంటబెట్టుకోవడంతో... ఎక్కడ కావాలంటే అక్కడ కుటుంబంతో సహా సేద తీరే అవకాశముంది.

చైనాలో మొత్తం 21 రోజులపాటు ప్రయాణించాల్సి వుంటుంది. అందుకు నలుగురు సభ్యులున్న కుటుంబానికి సుమారు ఆరు లక్షల రూపాయల వరకు ఖర్చవుతుంది. పైగా టిబెటన్ - చైనీస్ దేశాల అనుమతి పొందడం తప్పనిసరి. వెంట ఒక గైడ్‌ను కూడా ఏర్పాటు చేసుకోవాలి. అతని ఖర్చులన్నీ కూడా వీరే భరించాలి.

ప్యారిస్‌లో పెళ్లిరోజు

జులై 10 నాటికి పారిస్ చేరుకుని తమ పదిహేనవ పెళ్లి రోజును ఉద్విగ్నభరితంగా జరుపుకోవాలన్నది ఆనంద్ పునీత కోరిక. ఈఫిల్ టవర్ సమీపంలో... పల్చగా పరుచుకున్న చంద్రకాంతితో డిన్నర్ చేయాలన్నది వారి ప్లాన్. ఆ తర్వాత చెప్పేదేముంది! ప్యారిస్‌లో కారును షిప్ ఎక్కించేసి ... వీరు విమానంలో తిరిగి ఇండియా వచ్చేస్తారు.

ప్రయాణం అంతా అయ్యాక ... తమ యాత్రకు సంబంధించిన ఫొటోలు, వీడియోలతో ఒక 'షార్ట్ ఫిల్మ్' రూపొందించాలన్నది ఆనంద్ ఆలోచన. ఏ టీవీ చానల్ వారైనా దాన్ని ప్రసారం చేయకపోతారా అన్నది వారి ఆశ. అదేదీ కాకపోతే యూట్యూబ్ వుండనే వుంది.

✦

◆ సందర్భం

నిరంకుశత్వంపై తిరుగుబాటు అనేక రూపాల్లో వుండొచ్చు. ప్రేమికుల ధిక్కారం కూడా వాటిలో ఒకటి. పాత కాలపు ప్రేమ కథలన్నీ ఆధిపత్యంపైన, సంప్రదాయాలపైన తిరుగుబాట్లుగానే కనిపిస్తాయి. వాటిలో వరకు భాగం విషాదంగా ముగిసిపోయాయి. అందుకొక కారణం ఏమంటే ఆ కథల్లో నాయికలు వున్నంత ధైర్యంగా నాయకులు లేకపోవడం! దేవదాసు పిరికితనం అందరికీ తెలుసు. అలాంటి మరో కథ, చరిత్ర గాని చరిత్ర అనార్కలిది. భారతీయ భాషల్లో పలుసార్లు నిర్మాణమైన ఈ కథను అద్భుత సంగీత భరితంగా అందించింది అంజలీ పిక్చర్స్. వేదాంతం రాఘవయ్య దర్శకత్వంలో అక్కినేని, అంజలి జంటగా నటించిన 'అనార్కలి' 1955 ఏప్రిల్ 28న అంటే అరవై ఏళ్ల కిందట విడుదలైంది. అప్పట్లో అనేక రికార్డులు సృష్టించింది.

అంజలీదేవి, అక్కినేని

సంగీత భరిత ప్రేమకథ అనార్కలి

అంజలీ దేవి

కథా గమనం

మహాసామ్రాట్ అక్బర్ (ఎస్.వి.ఆర్) కుమారుడైన సలీం అనారు పూల తోటలో కనిపించిన సామాన్య యువతిని ప్రేమిస్తాడు. ఆమె అసలు పేరు నదీరా. అప్పుడాయన కూడా సామాన్య సైనికుడి వేషంలోనే వుంటాడు. యువరాజునని చెప్పకుండా అసలు సంగతి దాచిపెడతాడు. ఆ సమయంలోనే అక్బర్ అటుగా రావడంతో తప్పుకుంటాడు. అక్బర్ కూడా ఆమె గాన నాట్యాలకు ముగ్ధుడై ఆస్థాన నర్తకిగా ఆహ్వానిస్తాడు. ఆ తోటలో కనిపించింది గనక అనార్కలి బిరుదునిస్తాడు. సలీం మేనమామ సైన్యాధిపతి మాన్‌సింగ్ (నాగయ్య) ఈ ప్రేమ విషయం తెలుసుకుని అనార్కలిని మరచిపొమ్మని హెచ్చరిస్తాడు. పైగా సలీంను తనతో యుద్ధానికి తీసుకుపోతాడు. అక్కడ శత్రువులు బానిసల స్థావరంపై దాడి చేసి అనార్కలిని తీసుకుపోయి వేలానికి పెడితే సలీం తెచ్చుకుంటాడు. తర్వాత అతను యుద్ధంలో గాయపడితే అనార్కలి సపర్యలతో, సంగీతంతో కాపాడుకుంటుంది. అయితే అతను మామూలు సైనికుడు కాదని భావి భారత సామ్రాట్టని తెలుసుకుంటుంది. దాంతో అనార్కలి సంకోచిస్తే నాట్యంతో మెప్పించి ప్రేమ వరం పొందవచ్చని సలీం నచ్చజెబుతాడు. సలీంపై ఎప్పటి నుంచో ఆశలు పెంచుకున్న గుల్నాం (బాల సరస్వతి) ఆమె నాట్య ప్రదర్శన రోజున మత్తు కలిపిన పానీయం ఇచ్చి మోసం చేస్తుంది. దాంతో అనార్కలికి శిక్ష పడుతుంది. ఆ సమయంలో సలీం తన ప్రేమ సంగతి తల్లి జోదాబాయి (కన్నాంబ)కు చెప్పి గట్టిగా వాదిస్తాడు. ఇది తండ్రీ కొడుకుల మధ్య యుద్ధానికి దారి తీస్తుంది. తండ్రిపై వేటు వేయబోయి తల్లిని చూసి ఆగిపోతాడు సలీం.అక్బర్ పాదుషా వారిద్దరికీ మరణ శిక్ష విధిస్తాడు. అయితే కుమారుడికి అమలు చేయడు. అతను వచ్చే సరికి అనార్కలికి మాత్రం సజీవ సమాధి కట్టేస్తారు. ఈ సమాధి దగ్గర విషాద గీతాలు ఆలపించే సలీంను చూపించడంతో చిత్రం మొదలవుతుంది. అక్కడే ముగుస్తుంది.

అందరూ దిగ్గజాలే

'లవకుశ' తర్వాత అంజలి అంటే సీతమ్మ తల్లిగా స్థిరపడిపోయింది గాని మొదట ఆమె అందాల నాట్యతారగానే రంగ ప్రవేశం చేసింది. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంకు చెందిన అంజలి అసలు పేరు అంజనీ కుమారి. ఆమె నాట్య ప్రతిభ చూసి, తీర్చిదిద్దిన వాడు సంగీత దర్శకుడు ఆదినారాయణ రావు. అప్పటికే వివాహితుడైనా తర్వాత అతన్నే పెళ్లి చేసుకుని స్థిరంగా వుండిపోయింది. ఈ జంట స్థాపించిన అంజలీ పిక్చర్స్ ఎన్నో సూపర్ హిట్ చిత్రాలు అందించింది. వాటిలో మొదటిది 'పరదేశి'. రుణానుబంధం తర్వాత కాలంలో 'అనార్కలి'. 1953లో ప్రదీప్ కుమార్, బీనారాయ్‌లు జంటగా నటించిన 'అనార్కలి' హిందీ చిత్రం తరహాలోనే తెలుగులో దీన్ని తీశారు. సముద్రాల సీనియర్ రచన చేశారు. నటీనటులందరూ గొప్ప ప్రతిభా వంతులు కావడంతో గొప్పగా విజయవంతమైంది. అక్బర్‌గా ఎస్వీఆర్, మాన్‌సింగ్‌గా నాగయ్య, జోదాభాయ్‌గా కన్నాంబ పాత్రలకు ప్రాణం పోశారు. వారి ముందు కాస్త తేలిపోయేట్టుగా వుండే అక్కినేని కూడా సలీం పాత్ర మానసిక ఘర్షణనూ వూగిసలాటలనూ సమర్థంగా అభినయించి ఆకట్టుకున్నారు. 'బలహీనులు కాకండి జహాపనా' అని సలీం అంటే, రాజ మర్యాదలు కూడా మర్చిపోయి షేకూ అని అక్బర్ సంబోధించిన ఘట్టం గొప్పగా వుంటుంది. చివరకు రాజరికమే పైచేయి అవుతుంది. అయితే ప్రధానాకర్షణగా నిలిచింది మాత్రం అంజలి పాత్రే. టైటిల్ పాత్ర మాత్రమే గాక నిర్మాతలు కూడా వారే కావడంతో ఆమెకు కావలసినంత ప్రాధాన్యత లభించింది. ఆ ఏడాది ఆమె అరడజను చిత్రాల్లో రకరకాల పాత్రలు ధరించి చెరగని ముద్ర వేసింది.

మరపురాని పాటలు

'అనార్కలి' చిత్రానికి ప్రత్యేకాకర్షణ సంగీతం. పాటలన్నీ చిరస్మరణీయంగా నిలిచిపోయాయి.'రాజశేఖరా నీపై మోజు తీరలేదురా...' అన్న పాట తలమానికం. 'మదన మనోహర సుందర నారి, మధుర దరస్మిత నయన చకోరి, మందగమన జిత రాగమరాళి నార్కలి అనార్కలి' అంటూ ఘంటసాల గంభీర మధుర నాదం వినిపిస్తుండగానే 'వహ్వా...' అంటూ ఎస్వీఆర్ బాణీ మాట.. ఆదినారాయణ రావు సంగీత ఝరి.. రాజ శేఖరా పాట.. ఇప్పటికీ ఆపాత మధురంగా వినిపిస్తూనే వుంది. మరో గొప్ప పాట 'జీవితమే మధురమూ, రాగసుధా భరితమూ ప్రేమ కథా మధురమూ..' ఇది మాత్రం హిందీలోని 'ఏ జిందగీ హై...' అన్న బాణీతో రూపొందింది. 'కలిసె నెలరాజు ప్రణయ సఖిని కలిసె యువరాజు అనార్కలిని' అంటూ మరో పాట.. విశేషమేమంటే ఇన్నేళ్ల తర్వాత కూడా ఈ పాటలు వినసొంపుగానే వుండటం ఆదినారాయణరావు సంగీత మహత్యమే. ఆయన సంగీతం అందించిన చాలా పాటలు హిట్స్‌గా నిలిచాయి. తెలుగు సినిమా అయినప్పటికీ నిద్రిస్తున్న అనార్కలిని సలీం చూసే సన్నివేశంలో 'సోజా రాజకుమారి' అంటూ ఎ.ఎం.రాజా పాట పెట్టడం మరో విశేషం. రాచరికం క్రౌర్యాన్ని శపిస్తూ అనార్కలిని కీర్తిస్తూ ఘంటసాల గానంలో ప్రత్యేకంగా పాటలు పెట్టిన వేదాంతం రాఘవయ్య ప్రేమ సందేశం వినిపించగలిగారు.'అనార్కలి' గొప్ప విజయం సాధించింది. ఆ చిత్ర కళాకారులు దాదాపు ఎవరూ ఇప్పుడు లేరు గాని ఆ కళాఖండం ప్రేక్షకులకు కనువిందు చేస్తూనే వుంటుంది.

- పీ.పీ

విఫలయత్నం

అనార్కలి కథ చాలా చిత్రాల్లో అంతర్నాటకంగా చూపించడం మరో విశేషం. 'మంచి మనుషులు'లో శోభన్ బాబు,మంజుల, 'ఆరాధన'లో ఎన్టీఆర్ వాణిశ్రీ, తదితరులు ఈ ప్రేమ కథను అభినయిస్తారు. 'అనార్కలి' విడుదలైన తర్వాత దాదాపు పాతికేళ్లకు ఎన్టీఆర్, బాలకృష్ణ, దీపలతో 'అక్బర్ సలీం అనార్కలి' విడుదలైంది. దీనికి 'మొఘలే ఆజం'ను స్ఫూర్తిగా తీసుకున్నారు. అయితే సంభాషణలు కృత్రిమంగా వుండటం పెద్ద ప్రతికూలంగా మారింది. నారాయణ రెడ్డి రాసిన మాటలు తలకిందులుగా నడుస్తాయి. 'ఇచ్చారు మాకీ బహుమానం' అన్నట్టు వుంటాయి. అక్బర్‌గా నటించిన ఎన్టీఆర్ వేషం బాగున్నా ఈ కారణంగానే పాత్ర విఫలమైంది. బాలకృష్ణ అప్పటికి వర్ధమాన నాయకుడు కాగా దీప సీనియర్ హీరోల సరసన వేసి ప్రౌఢదశలో వున్న స్థితి. ఈ కారణంగా వారి కాంబినేషన్ కూడా అంతగా నప్పలేదు. అయితే ఈ చిత్రంలో పాటలు బాగుంటాయి. 'సిపాయి నీకై ఎంత వేచి వేచి వున్నానో, తారలెంతగా వేచేనో, ప్రేమిస్తే తప్పంటారా' వంటిపాటలు బాగుంటాయి. ఏమైనా ఆ చిత్రం పాత 'అనార్కలి' దరిదాపులకు రాలేకపోయింది.

◆

'అక్బర్ సలీం అనార్కలీ' గా ఎన్టీఆర్, బాలకృష్ణ, దీప..

ఆదినారాయణరావు

కన్నాంబ

సముద్రాల సీనియర్

ఎస్వీఆర్

◆ అట్టమీద కథ

మూడు ముడుల చేరిక, రెండు హృదయాల కలయిక, ఇద్దరిదీ ఒకే జీవితంగా పొందిక... ఇవీ ఒకప్పటి పెళ్లినాటి ముచ్చట్లు. మూడు ముళ్ల గాయం, రెండు హృదయాల యుద్ధం, నాదన్నది ఒకటే జీవితం..అది ఇంకొకరి హస్తగతం... ఇవీ నేటి పెళ్లీడు తరపు ఇక్కట్లు. కళ్యాణ ఘడియలు మరీ ఆలస్యంగా మోగుతున్నాయి. ప్రేమల్లో విరహాలు విహరిస్తున్నంత తేలిగ్గా వివాహంపై వ్యామోహాలు పుట్టట్లేదు.

పెళ్లి కలేనా?

పెళ్లంటే ఎన్నో భయాలు, లెక్కలు నేటి యువతరానికి. కీలక మలుపులో కో-డ్రైవర్ లేకుండా కెరీర్ ర్యాలీలో కొట్టుకుపోతున్న పోటీ నవతరానిది. జీవిత భాగస్వామి అంటే భాగాహార లెక్కలే తప్ప ఉమ్మడి బంధానికి ముడి వేయడంలేదు. ముప్ఫై ఏళ్లు దాటిన కొడుకు వరుడయ్యేదెపుడు? పాతికేళ్లు నిండినా పెళ్లిచూపులకు ఇష్టపడని కూతురిని పెళ్లి పీటలెక్కించేదెపుడు? తల్లిదండ్రులకు జవాబు రాని ప్రశ్నలు. పెళ్లంటే కాంట్రాక్టు బంధమా, బలవంతపు ప్రేమేనా? బరువు, బాధ్యతల తలంటేనా? యువతకు బదులు లేని ప్రశ్నలు. వయసు రెడీ అయినా పెళ్లికి మనసు సిద్ధం కావడంలేదు. ఎవరి కారణాలు వారివి. ఉన్నత చదువులు, ఉద్యోగ సోపానాలు, గత బంధాల పాతాళాలు, భవిష్యత్ ప్రణాళికల అగాధాలు, సాధ్యంకాని కోరికల చిట్టాలు, బాధ్యతల బెదిరింపులు, స్టేటస్ వెక్కిరింపులు, పోలికల కుంగుబాటు, నడతల వెనుకబాటు, చాలీచాలని జీతం, స్వేచ్ఛా జీవితం, జల్సా మనస్తత్వం ఇంకా ఎన్నో. బంధం కాదది దిగ్బంధనమంటూ మనసును విరిచేసే ఉపన్యాసాలు, ఉదాహరణలు అదనం. 'హ్యాపిలీ అన్‌మేరిడ్' భావజాలానికి బాగా అలవాటు పడిపోయింది యువత. ఇదీ నేటి లేట్ మ్యారేజీల అర్లీ సంస్కృతి. మరో ఆర్నెల్లు అనే దాటవేతలకు, మరో అబ్బాయి అనే కప్పదాట్ల వెనుక ఎంతో విషయం ఉంది. వేగమైన జీవితంలో కొట్టుకుపోతున్న అతి సున్నితమైన జాతికి పెళ్లి కళ కలేనా?

'చదివింపులు'

చదువులాట, ఉద్యోగాల వేట పెళ్లిని కనీసం ఐదారేళ్లు వెనక్కు నెడుతున్నాయనేది నిపుణుల మాట. ఒకప్పుడు డిగ్రీ చదివితే ఉద్యోగం దొరికేది. ఉన్నతమైన కొలువు కాకపోయినా ఉన్నంతలో బాగానే బతకగలిగే జీతమొచ్చేది. రెండేళ్లలలో ఏదో రకంగా స్థిరపడేవారు. సంపాదనకు చదువే అవసరం లేదన్నట్టు ప్రత్యామ్నాయాలు దొరికేవి. ఎట్లా అయినా రెండు రెళ్లు అంకెకు చేరే సరికి జీవితంపై స్పష్టత వచ్చేసేది. పెళ్లికి తలుపుల తలపులు తెరుచుకునేవి. ఐదారు 'చూపు'ల్లోనే రెండు వేళ్లు కలిసేవి. పెళ్లికి శుభం కార్డు పడేది. కాని, ఊరించే ఐటీ కొలువులు, వేలల్లో జీతాలందుకోవాలనే లక్ష్యాలు నేటి తరాన్ని ఒక పట్టాన చదువును ముగించనీయడం లేదు. ప్రతి సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కలగాలి, ఏ ఉద్యోగమైనా టెక్నాలజీ వంటబట్టాలి. కోర్సు వెంట కోర్సులతో బిజీబిజీ. శాప్‌ల శాపాలు, డిప్లొమాల భారాలు. ఎంబీయేలు, ఎంసీయేలు, బీటెక్‌లకు వీటిని జోడించినా కొలువు కొలుపే. నంద్యాల, హైదరాబాద్, విజయవాడ, అవనిగడ్డ, రాజమండ్రి, విశాఖ, తిరుపతి లాంటి చోట్ల వెలసిన వందలాది శిక్షణ కేంద్రాలు, వేలాది హాస్టళ్లలో మగ్గిపోతున్న బ్యాచిలర్ల సంఖ్య సమస్య తీవ్రతకు అద్దంపడుతోంది. ప్రభుత్వ ఉద్యోగానికి పెళ్లికి ఉన్న లింకది. ప్రైవేటు ఉద్యోగాల్లో అయితే జీతాల కుస్తీపాట్లకు తోడు, సెటిల్‌మెంట్ సమస్యలు. ఎంత కాలం పని దొరుకుతుందో తెలీదు, సమయానికి జీతమొస్తుందో



రాదో తెలీదు. ఆర్నెల్లు గడిచేసరికి మరో రెజ్యూమ్ తయారు చేయించేస్తున్న కార్పొరేటు కొలువు కల్చర్. పోనీ, ప్రత్యామ్నాయాలపై దృష్టి పెడదామంటే డబ్బు దండిగా ఖర్చయిపోయి, అప్పుల్లో కూరుకుపోయి చిన్నచిన్న వ్యాపారాలూ పెట్టలేని నిస్సహాయత. ఇక పెళ్లి మాట ఎలా ఎత్తగలరు. వీటికి తోడు సొంత కాళ్లపై నిలబడాలనే బలమైన కాంక్ష అబ్బాయిలదైతే. చదువులకు అన్నీ ధారపోసిన కన్నవారికి తమ పెళ్లి భారం కాకుండా సొంత సంపాదనతోనే పెళ్లి ఖర్చులు చూసుకోవాలనే ఆకాంక్ష అమ్మాయిలది. ఈ తప్పనిసరి పరిస్థితి పెళ్లిని మరో ఏడడుగులు వెనక్కు వేయిస్తోంది. సమస్య ప్రతి ఇంటిదీ అయినా, పెళ్లి దగ్గరకు వచ్చేసరికి ఉద్యోగం విషయంలో రాజీలేని అభిప్రాయం అందరిదీ. అందరికీ మంచి ఉద్యోగస్తులే కావాలి. స్థిరపడినవారే దొరకాలి.

పల్లెటూరి బావొద్దు

పట్టణాల్లో ఇలా ఉంది గాని, గ్రామాలైనా కాస్త నయం అనే అవకాశం లేదు. పల్లెకు పెళ్లి కష్టాలెక్కువయ్యాయి. గ్రామీణ అబ్బాయిలకు పిల్ల దొరకడం లేదు. వరసైన వారూ దూరం జరుపుతున్నారు. పట్టణాలైతే కష్టం అంతగా తగలదని, అన్ని వసతులు పల్లెల్లో కష్టమని తల్లిదండ్రుల అభిప్రాయం. చిన్నదో పెద్దదో ఉద్యోగం చేస్తేనే కదా చదివిన చదువుకు అందం, ఎంతైనా పట్టణ జీవనపు చందమే వేరనేది యువతుల మనోగతం. పట్టణాల పడుచులు పల్లెల్లో కుదురుకోవడం కష్టమే కావచ్చు. కొసమెరుపేమిటంటే పల్లె జీవితానికి బాగా అలవాటు పడిన స్థానిక యువతులకు సైతం పట్టణాల్లో వరుడిని వెదుకుతున్నారు. వ్యవసాయం ఇతరత్రా నమ్ముకుని కాయకష్టం చేస్తూ సెటిల్‌మెంట్ సమస్యే తెలీని పల్లెల్లోని యువకులకు ఇది మింగుడు పడటంలేదు. పిల్ల దొరికితే జాక్‌పాట్ కొట్టినట్టే. పట్టణాల్లో సెటిలవ్వలేని వారిదో సమస్య, పల్లెల్లో సెటిలైన వారిదో సమస్య.

టైలర్‌మేడ్ పిచ్చి..

కాబోయేవారిలో గుణగణాలతో పాటు కొంచెం ఎక్స్‌ట్రా కోరుకుంటున్నారు కొందరు. ఓ చిట్టా రెడీగా పెట్టుకుని కోరుకున్నవి ఉన్నాయో లేవోనని టిక్ చేసుకుంటున్నారు. ఎవరికివారిది ఓ ప్రత్యేకమైన ఫ్రేమ్. వారి జీవిత భాగస్వామి సరిగ్గా దానిలో అమరాలి. అందం, ఎత్తు, వయసు, చదువులాంటి పాత కొలతలకు తోడు, అలవాట్ల నుంచి అభిరుచుల వరకు అన్ని సరిగ్గా జత కుదరాలి.

చదివే పుస్తకాలు, చూసే సినిమాలు, తిరిగే వాహనాలు, చుట్టొచ్చే ప్రాంతాలు, తినే తిండి, వేసుకునే దుస్తులు, ఆఖరకు ఇష్టమైన సెలబ్రెటీల్లోను తేడాలొస్తే ఇక కథ కంచికి చేరినట్టే. కార్పొరేట్ సంస్కృతి పుణ్యమా అని అరువు తెచ్చుకున్న కొలమానాలెన్నో యువతను వివిధ వర్గాలుగా లెక్కకడుతున్నాయి. మోడ్రన్, సెమీ క్లాస్, మాస్, ఫ్యాషనబుల్, ట్రెడిషనల్, ఈజీ గోయింగ్, సీరియస్‌కైండ్ అంటూ పెళ్లిళ్ల పేరయ్యలకు కొత్త కొత్త కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. చుట్టూ ఉన్న స్నేహితులు కుళ్లు కునేలా జీవిత భాగస్వామి ఉండాలి. తమ సర్కిల్స్‌లో ఇమిడిపోవాలి. తాము అనుకరించే మార్పుల్లో ఒదిగిపోవాలి. కూల్‌గా ఉండాలని ఒకడు, క్రేజీగా ఉండాలని ఒక అమ్మడు... వ్యక్తిత్వాల్లో ఇసుమంత తేడాను సహించడంలేదు. టేస్ట్‌కు తగ్గవాళ్లు రాకుంటే భరించలేమని ముందే తెల్లజెండాలు ఊపేస్తున్నారు. పైపెచ్చు, కలకాలం కలిసి ఉండగలరో లేదో పెళ్లికి ముందే తెలిసిపోవాలి. కొందరు డ్రీమ్‌గర్ల్, సోల్‌మేట్‌ల కోసం ఎన్నిరోజులైనా.. (క్షమించండి, ఎన్ని ఏళ్లయినా) వేచిచూసేందుకు సిద్ధం. దాని కోసం పెళ్లిచూపులకు అదనంగా మీటింగ్‌లు. ఇంకా విచిత్రమేమిటంటే, పెళ్లి చూపులకు వెళ్లకుండానే ఒకరి గురించి ఒకరు తెలుసుకోవడానికి రకరకాల వేదికలను ఆశ్రయిస్తున్నారు. తల్లిదండ్రుల వరకూ వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో పరిచయమైపోయి క్లారిటీ కోసం తంటాలు పడుతున్నారు. ఎన్నో మేట్రిమోని సైట్స్‌లో ఇష్టాల్ని తెగేసి చెబుతున్నారు. మేట్రిమోనీ సైట్లు వీరి కోసం ప్రత్యేకంగా చాటింగ్ ఏర్పాట్లు చేస్తున్నాయి. అయినా ఏదో అసంతృప్తి, ఇంకా మంచి సంబంధం దొరుకుతుందేమో, ఇంకా ఎవరో ఉండి ఉంటారేమోనని స్కిప్‌ల మీద స్కిప్‌లు.

నా చిన్ని జీవితం..

కాస్త చేతికి డబ్బులు వచ్చేసరికి నాకు మిగిలింది చిన్ని జీవితం, ఒకే ఒక్క జీవితం అని గుర్తొచ్చేస్తుంది. తప్పక చేయాల్సిన పనులు, చూడాల్సిన విషయాలు, పొందాల్సిన అనుభూతులంటూ భారీ ప్రతి వర్ష ప్రణాళికలు తయారు చేసేసుకుంటారు కొందరు. సామాజిక, సాంకేతిక విప్లవాల పుణ్యమా అని కొత్త, కొత్త జీవన పోకడలకు బీజం పడుతోంది. పార్టీల కల్చర్ ఎక్కువైపోయింది. జల్సాగా, జాలీగా బతికే వీరికి పెళ్లి బాధ్యతలంటే జ్వరం వచ్చేస్తుంది. ఇంకొందరిది స్వేచ్ఛా మనస్తత్వం. రకరకాలుగా జీవితాన్ని స్వేచ్ఛగా ఆస్వాదించాక గాని పెళ్లి మాట ఎత్తరు. అనేక అనుభూతులు వెదుక్కుంటూ బహుళ సంబంధాలకు ఓకే చెప్పేస్తున్నారు. డేటింగ్‌లు, లివ్ ఇన్, లివింగ్ టుగెదర్ లాంటి వాటిలో వారికి స్వేచ్ఛ దొరుకుతోంది, బాధ్యత తప్పుతోంది. పెళ్లిలోలా ఒకరికే అంకితమవ్వాల్సిన బాధ కూడా ఉండదనేది వీరి అతి ఆలోచనలు. ఈ రకంగా కొన్నాళ్లు పాటు గడిపి వీటిలో ఎదురుదెబ్బలు తినేసరికి పెళ్లికి సిద్ధపడుతున్నారు. వింత ఎక్స్‌పీరియెన్స్‌ల

తర్వాతే కళ్యాణానికి ఓటు. పిల్లలొక చోట, తల్లిదండ్రులొక చోట అవడం. చదువులు, ఉద్యోగాలకే కాలమంతా కరిగిపోవడంతో పెద్దల మార్గనిర్దేశనం, సలహాలు, సర్దిజెప్పడాలు, సరిచేయటాలు లేక వివాహానికి ముహూర్తం కుదరడంలేదు.

గత బంధాలు.. కొత్త గాయాలు..

చదువు, ఉద్యోగాల్లో ఏదో ఒక దశలో అంతులేని ప్రేమలు, హద్దులు లేని స్నేహాలు మామూలైపోతున్నాయి. కొందరైతే ప్రేమించిన వారిని తప్ప ఇంకెవరినీ జీవిత భాగస్వామిగా ఊహించలేకపోతున్నారు. ప్రేమ విఫలమైతే కోలుకోవడానికి చాలా ఏళ్లు పడుతోంది. పరిధి దాటిన స్నేహాలు, టైంపాస్ బంధాలు కలిగించే నష్టాన్ని పూడ్చుకోవడానికి చాలా సమయం ఖర్చయిపోతోంది. ఆ గాయాలన్ని మానేవరకు మరొకరిపై నమ్మకం, ప్రేమ కలగవు. గత బంధాల భయాలు, అనుభవాలు కొత్త బంధంలోకి అంత తేలిగ్గా అడుగుపెట్టనీయవు. సరదాగా మొదలయ్యే వాటిలో తెలీకుండానే కూరుకుపోయి విపరీత భావోద్వేగాలకు లోనవుతున్నారు. ఈజీ లవ్, ఈజీ బ్రేకప్‌ల్లో ఉన్నంత తేలికదనం పర్యవసానాల్లో ఉండదనే నిజం తెలుసుకునేలోపు చావు దెబ్బతింటున్నారు. కళ్యాణంపై విరక్తి పెంచుకుంటున్నారు. దగ్గరివారి విడాకులు, గృహ హింస ఘటనలు, అనుమానపు జబ్బుల దాఖలాలు మరింత హాని చేస్తున్నాయి.

వీటికి తోడు జాతకాల పిచ్చి. పేరు, నక్షత్రం, తిథి ఇలా బోల్డెంత లిస్టులో చిన్న తప్పిదమున్నా పెళ్లికి ససేమిరా అనేవారు నేటికీ ఉన్నారు. కుజ దోషాలు, నాగ దోషాలంటూ కళ్యాణాన్ని వెర్రి నమ్మకాలతో కాటేస్తున్నారు. పెళ్లికి, చావుకు లింకులు పెట్టి జీవితాల్ని నాశనం చేస్తున్నారు. ఇంతగా విజ్ఞానం అందుబాటులో ఉన్నా వారికి పట్టదు. యువతైనా వీటి నుంచి బయటపడితే కాస్తన్నా మార్పు వస్తుంది.

స్థిరపడాల్సింది మనసు

చదువుసంధ్యలు ముఖ్యమే, ఉద్యోగమూ స్త్రీపురుష లక్షణమే కాదనలేం. స్థిర పడాలనుకోవడంలో తప్పు లేదు. కానీ, ఈ లోగా జీవితం సగం దాటిపోతుంది. జీవితాంతం నిలిచిపోయే గొప్ప బాంధవ్యాలతో కలిసిసాగే కాలం తగ్గిపోతుంది. మంచి సంపాదన కావాల్సిందే. కానీ, ఉన్నంతలో తెలివిగా నెట్టుకొచ్చే పాఠం వంటబడితే ఇబ్బందేముంది. ఉన్నతమైన జీవితం కోసం పోరాటం, పోరాటమే. కొన్ని సర్దుబాట్ల ద్వారా పెళ్లి సాధ్యమే. స్థిరపడటం అంటూ ఒకటి లేదని స్టీవ్‌జాబ్స్ చెప్పాడు. ఎప్పటికప్పుడు మార్పులకు అనుగుణంగా నేర్పుగా జీవితాన్ని నడిపించాలని చెప్పాడు. అయినా పెళ్లిలాంటి శాశ్వత బంధంలో స్థిరపడాల్సింది మనసు. ఒంటరి పోరాటంలో తోడు కలిస్తే కాస్త తేలికయ్యే అవకాశముంది కదా. బైక్ తర్వాత కారు, ఫ్లాట్ తర్వాత ఇల్లు, క్లర్క్ కాస్త ఆఫీసర్ అంటూ సాగిపోయే జీవితానికి ఎటూ అంతు ఉండదు. జీవితంలో ఎత్తుపల్లాలు సహజం, ఎపుడూ విజయాలే ఉండవు. వీటికే పెళ్లికి ముడిపెడితే నష్టమే. ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులోనే జరగాలనేది కేవలం పెద్దలమాటే కాదు. శాస్త్రీయంగా కూడా దీనికి సహేతుకత ఉంది. రేడియేషన్ ప్రభావానికి ముప్పై ఏళ్లు పూర్తవకుండానే పిల్లల్ని కనే

బంధం కలిపేవారేరి?

ఇది వరకు పెళ్లి బాధ్యతల్ని మీదేసుకునే పెళ్లి పెద్దలు కుటుంబానికొకరు ఉండేవారు. సన్నిహితులు, స్నేహితులూ పెళ్లి కబురు మోసుకొచ్చేవారు. చుట్టాలు, దగ్గరి వారి చిట్టా తమ దగ్గరుంచుకుని ఆ ఊరు నుంచి ఈ ఊరికి సంబంధం కలిపేవారు. వధూవరుల తరపు వకాల్తా పుచ్చుకుని కొత్త జీవితాలకు అండగా నిలిచేవారు. కాని ఇప్పుడు సమాజంలో చోటుచేసుకుంటున్న పరిణామాల వల్ల, పెళ్లిచూపులకు తోడుగా వెళ్లడానికే జంకుతున్నారు. ఎక్కడెక్కడో చదివి, ఉద్యోగాలు చేసేవారి వివరాలు, నడత తీరు తెలియక పెళ్లి సంబంధాల ఊసే ఎత్తడంలేదు. ఒక తరం

దాటితే తాత తరపువారు కూడా కొత్త చుట్టాలవుతున్న ఒంటరి కుటుంబాలు ఎక్కువైపోయాయి. వరసలు కలవడానికే గంటల పాటు లెక్కవేసుకోవాల్సిన పరిస్థితి. మేట్రిమోనీలు, పెళ్లిళ్ల బ్రోకర్లపైనే భారం. ఈ రకమైన సంబంధాలతో చిక్కేమిటంటే మల్టిపుల్ అవకాశాల వల్ల ఓ పట్టాన విషయం తేలదు. ఇంకా మంచి సంబంధం కావాలనే వెదుకులాట. సమయం ఖర్చయిపోతూ ఉంటుంది. పూర్తిగా తెలియని సంబంధాలే రావడంతో అనేక సందేహాలతో విషయం నానుతూ ఉంటుంది. సైట్లలో వివరాలు రాసినదాన్ని బట్టే నమ్మాలి. రూఢీ చేసుకునేందుకు అనేక దారులు వెతుక్కోవాలి. ఈలోగా సంబంధం చేజారిపోతుంది. అదే తెలిసినవారు తెచ్చే సంబంధమైతే ఏదో తెలియని భరోసా. చకచకా ఏర్పాట్లు సాగిపోతూంటాయి. తేడాలొస్తే సర్దిచెప్పే అవకాశాలుంటాయి. తప్పటడుగుల్ని సరిచేసి ఏడడుగుల వరకు నడిపించే అధికారం ఉంటుంది. నలుగురికీ అక్షితలు వేసే పెళ్లి పెద్దల పెద్దరికం మళ్లీ కనిపిస్తుందో లేదో.

సామర్థ్యం తగ్గిపోతోందని లెక్కలు చెబుతున్నాయి. ఐవీఎఫ్‌లు, సరోగసీ కేంద్రాల చుట్టూ తిరుగుతోంది ఎక్కువగా లేటు పెళ్ళిళ్ల వల్లేనట. లేటు గర్భాల వల్ల గర్భస్రావాల సంఖ్య ఎక్కువే, లేదా నెలలు నిండని బిడ్డలు పుట్టి అనేక రుగ్మతల పాలవుతున్నారు. తల్లుల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటోంది. పిల్లలు కీలక దశకు చేరుకునే సరికి తల్లిదండ్రులు ముసలివారై సామాజిక సౌష్టవం దెబ్బతింటుంది. శాశ్వతంగా తోడునందించే కళ్యాణానికి ఇక ఆలస్యమెందుకు మరి.

ఇక పట్టణాలు, పల్లెలకు వసతుల్లో ఎంత తేడా ఉందో, సామాజిక సంబంధాల్లోను అంత తేడా ఉంది. ఉమ్మడి కుటుంబాలు, వ్యసనాలు లేని మనుషులు, అపార్థాలు లేని బంధాలకు పల్లెలు నెలవులు. బంధాలకు ఎక్కువ విలువనిచ్చే చోట జీవితం సాఫీగా సాగిపోతుంది. వేగం, ఉధృతిలో పడి కొట్టుకుపోకుండా నింపాదిగా, ప్రశాంతంగా కదులుతుంది. పల్లె జీవనానికి అలవాటు పడినవారు కొత్తగా పట్టణ జీవితానికి మారేటపుడు ఇబ్బంది తప్పదు. చదువుకు తగ్గ ఉద్యోగం దొరకడం అక్కడా కష్టమే. అయినా, పల్లెల తీరూ ఇపుడు మారుతోంది.

లెక్కలకు అర్థం లేదు

సోల్‌మేట్‌లంటూ ఎవరూ రెడీమేడ్‌గా దొరకరు. టైలర్‌మేడ్ లెక్కలకు అసలు అర్థమే లేదు. ప్రత్యేకంగా ఏ హ్యూమనాయిడ్ రోబోలనో తయారుచేయించుకోవాల్సింది తప్పితే. ఎవరిది, వారిది విలక్షణమైన వ్యక్తిత్వం. తమదైన అభిరుచి. అవే కదా కొత్తదనాన్ని, నిండుదనాన్ని ఇస్తాయి. వాటిని అర్థం చేసుకుని, ప్రత్యేకతల్ని గౌరవిస్తూ, తేడాల్ని ప్రేమిస్తేనే కదా నిజమైన బంధం అనేది. వారే కదా సోల్‌మేట్ అయ్యేది. ప్రతిదానికి రేటు కట్టే కార్పొరేట్ సంస్కృతిలోని లోతుపాతుల్ని తెలుసుకుంటే ముందే తేరుకోవచ్చు. అంతా మనకే అనుకూలంగా ఉండాలన్న సిద్ధాంతమూ చాలా పొరబాటు. ఒకరి కోసం ఒకరు జీవిస్తూ ముందుకు నడిపించే గట్టి బంధంలో ఏదైనా అనుకూలంగా మారిపోతుంది. ఆ బంధాల ముందు డ్రీమ్‌గర్ల్, ప్రిన్స్‌చార్మ్‌లు ఇక దిగదుడుపే. అయినా ఓ వ్యక్తి పూర్తిగా తెలియాలంటే కొద్దిపాటి పరిచయంతో సాధ్యమేనా?. పెళ్లి లాంటి శాశ్వత సంబంధం విషయంలో నమ్మకంతో అడుగేయక



తప్పదు.

పెద్ద బంధం

అవును చిన్ని జీవితమే. దాన్ని చాలా సంతోషాలతో నింపేయాలి. నిజమే, ఆ చిన్న చిన్న సంతోషాలెన్ని కలిపితే జీవిత భాగస్వామి బంధానికి సరి తూగుతాయి!. ఒక్క శాశ్వత బంధమిచ్చే మరెన్నో బాంధవ్యాల పాటిదా వాటి మొత్తం విలువ. ఇంకోటి, మరోటి అనే అంతులేని కోరికల చిట్టాలో లేని సంతృప్తి వివాహ బంధంలో దొరుకుతుంది.

ఉరుకులు పెట్టే మనసుకు సాంత్వన కలుగుతుంది. చిన్న చిన్న సరదాల కోసం పెద్ద బంధాన్నే పక్కన పెడితే ఎలా? స్వేచ్ఛకు, సంతోషానికి పెళ్లెందుకు అడ్డు అవుతుంది. వివాహమనేది ఎవరో బయట గడియ పెడితే తప్పక, బలవంతంగా కలసి బతికే సర్దుబాటు కాదు. తలుపులు తెరచినా ఎగిరిపోనంత దగ్గరి మనసుల చిరునామా అది.

గతమంటే గతించిందే కదా

మనసుంటేనే కదా మనిషి అనేది. భావోద్వేగాలుంటేనే కదా మనసు అయ్యేది. ఎందరివో విఫలమైన ప్రేమలు, మోసపోయిన మనసులు. తర్వాత వచ్చే పేజీలో ఏముందో తెలియనంత సస్పెన్స్ నిండిన నవలే జీవితమంటే. పూర్తిగా పుస్తకాన్ని తిరగేయక ముందే జీవితసారాన్ని ఎలా అనుభవిస్తాం. ఒక్క పేజీలో ఉన్న వ్యథను దాటకపోతే తర్వాత పేజీల్లోని సంతోషాల్ని ఎలా అనుభూతి చెందగలం. ఒక బంధం దెబ్బతీస్తే అన్ని అనుబంధాలు అలాగే ఉంటాయనుకుంటే ఎలా? తెలియకుండా జరిగిన తప్పుకు మిమ్మల్ని మీరే బాధ్యుల్ని చేసుకుంటే, ఇంకొకరు ఎలా క్షమిస్తారు? పాఠాలు నేర్చుకుని, మరో తప్పు జరక్కుండా క్షమించేసుకుంటే సరి. వివాహం లాంటి శాశ్వత బంధాన్ని ఆలస్యం చేసుకోవడం వల్లే ఈ తరహా విషాద బంధాల్లో చిక్కుకునేది. ఎవరో పెళ్లి జీవితంలో చూసిన గృహహింసలు, మోసాలు, సమస్యలు ప్రతి ఒక్కరికి ఎందుకు ఎదురౌతాయి. జాగ్రత్తగా వివాహ బంధంలోకి అడుగులు వేస్తే శాశ్వతంగా నిలిచిపోయే ప్రేమ బంధానికి దారులు పరుస్తుంది.

-అజయ్ కుమార్ వారాల

వివక్షకు ఫలితం

ఒక రెండు, మూడు తరాల వెనుకటి నుంచి జరుగుతున్న ఓ పాపానికి ప్రతిఫలం కూడా ఈ సమస్యకు మరో ప్రధాన కారణం.ఆడపిల్ల అని తెలిస్తే భ్రూణ, శిశు హత్యలకు పాల్పడి, తొలిచూలు మొగ పిల్లవాడు కాగానే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకోవడం వల్ల ఆడపిల్లల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. 1990 నుంచి ఇప్పటివరకు దేశంలో సుమారు కోటి మంది ఆడపిల్లల్ని కడుపులో ఉండగానే చంపిన దారుణాన్ని లెక్క గట్టింది ఓ విదేశీ సంస్థ. ఏటా పది లక్షల భ్రూణ హత్యలు జరుగుతున్నాయని తేల్చిచెప్పింది. దీనికి శిశుహత్యలు అదనం. మన రాష్ట్రంలో ప్రతి వంద మంది అబ్బాయిలకు ఆరుగురు ఆడపిల్లలు తక్కువగా ఉన్నారని గణనలో తేలింది. ప్రతి అబ్బాయికి, అమ్మాయి దొరికే అవకాశం కష్టమే. ఒక అమ్మాయికి ముగ్గురు, నలుగురు అబ్బాయిల తరపున వస్తున్న పోటీతో ఏ సంబంధాన్ని ఖాయం చేసుకోవాలో తెలియని పరిస్థితి. ఆ అమ్మాయికి సంబంధం కుదిరిపోయాక, వేరే ప్రయత్నాలు మళ్లీ మొదలు. ఇలా ఓ సంబంధం తేలేలోపు చాలా ఆలస్యమైపోతోంది. మరి దండయాత్రలతో ఇంకెంత కాలం గడిచిపోతుందో. ✦

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ - భాగం -32

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**

ఇంట్లో ఉన్న ఒకే ఒక టేబుల్ వద్ద కూర్చుని రచనా వ్యాసంగం కొనసాగించాడు మార్క్స్. తండ్రిని చూసి పిల్లలకో కొత్త ఆట ఆడుకోవాలనిపించింది. ఆయన వెనుక మరికొన్ని కుర్చీలు వేసి, ముందరి కుర్చీలలో కూర్చున్నది గుర్రమనుకుని 'స్టేజ్ కోచ్ గుర్రం' ప్యాసెంజర్లను లాగకపోతే కొరడాతో కొట్టాలి. అదీ ఆట.

"నాన్న స్టేజ్ కోచ్ లాగుతూనే Eighteenth Brumaire రాశాడు." అని గుర్తు చేసుకున్నది కూతురు. రోజంతా పిల్లల గోలే. రాత్రి ప్రశాంతత తోనే ఆయన ఏకాగ్రతతో ఏమైనా ఆలోచించగలిగేవాడు. నిద్రపోడు. అలాగే తెల్లారుతుంది. తాను కొనగలిగిన అతిచవక సిగార్లు మాత్రమే కాలుస్తూ తన పరిశోధన కొనసాగించాడు. చివరికి అందరూ లేచే సమయానికి అలసి సోఫా మీద గాఢనిద్రలోకి జారుకున్నాడు. ఈ అలవాట్ల వల్ల ఆరోగ్యం బాగా దెబ్బతింది. ముఖ్యంగా కళ్లు పాడైనాయి. కొవ్వొత్తులు లేక నూనె దీపాల వెలుగులో చదవాలి. కాని, వాటి కాంతి చాలా తక్కువ. కొవ్వు దీపాలు ఎక్కువ వెలుగునిస్తాయి. కాని ఆ ఇరుకు గదిలో వాటిని భరించడం కష్టం. ఇక వేరే పరిష్కారం లేదు. చలికాలంలో లండన్ పగటి పూట కూడా చీకటిగా వుంటుంది. అప్పుడు కూడా ఈ దీపాలు తప్పవు.

మార్క్స్ ఎంత ప్రయత్నించినా బ్రూమేర్ వ్యాసాలు వైడిమియర్ పత్రికల్లో అచ్చువలేదు. మార్క్స్ తన పుస్తకం ముగించే నాటికి పత్రిక ఆగిపోయింది. "వ్యాసంగా ప్రారంభించిన బ్రూమేర్ దానంతటదే పుస్తకం సైజుకు

"ఇంట్లో జరిగే రాజకీయ సమావేశాలు, చర్చలు, అప్పుల వాళ్ల వేధింపులకు అలవాటు పడి మార్క్స్ పిల్లలు ఇదే సహజమైన వాతావరణం అనుకున్నారు. కొంతవరకిది నిజం కూడా. వాళ్ల సావాసగాళ్లు కూడా పేద శరణార్థులైన ప్రతిపక్ష నాయకుల పిల్లలే మరి. మార్క్స్ దంపతులకు తెలుసు. అందరిలాగా మధ్యతరగతి వాళ్ల ఇళ్లలో పెరిగితే వాళ్ల దృక్పథం మరోలా ఉండేది. లండనుకు చేరేనాటికి వాళ్లకు తెలుసు, ఇక తమది సమస్యాత్మమైన జీవితమని, పైగా ఈ కష్టాలను వాళ్లు ఐచ్ఛికంగా ఎంచుకున్నారని. ఇక మీదట వాళ్లు మరింత భయానకమైన చీకటి కుహరంలోకి ప్రవేశించబోతున్నారు. అవును మరి. వాళ్లకు అనుకూలంగా ఒక్కటీ జరగటం లేదు."

మార్క్స్, ఎంగెల్స్ మిత్ర బృందం

పెరిగింది." అన్నాడు మార్క్స్. ఈ రచనను బాగా ఆనందించాడు. మార్క్స్ అసలు ఈ రకమైన పుస్తకం రాయటంలో తనకు తానేసాటి. ఈ అపార పాండిత్యాన్ని మేళవించి, సమకాలీన సమస్యల్ని చారిత్రక నేపథ్యంలో చూడగలగటం ఆయన విలక్షణత. ఇతరులకు కేవలం అలలుగా కనిపించిన వాటిని, ఆయన అధ్యయనం చేసి అవి ఆటుపోట్లో కాదో చెప్పగలడు.

పిల్లల గుర్రపు బండి లాగిన గుర్రం Eighteenth Brumaire రాసిందంటే నమ్మలేం. కొవ్వొత్తుల నూనె దీపాల వెలుగులో ఆయన కళ్లు మంటలెక్కాయి. జలపాతం లాంటి ఎంత అద్భుతమైన వచనం. ఎంత స్పష్టత. అనితర సాధ్యమైన ఆ విశ్లేషణ, ప్రతిభ, శైలి. అయితే అన్ని ఉన్నా అది అచ్చు వేయటానికి పబ్లిషర్ దొరకలేదు. డబ్బు సంపాదించటానికి మరేం రాయాలి. ఫిబ్రవరి చివరలో ఎంగెల్స్‌కు రాసిన లేఖలో "హాయిగా వుంది. నా కోటులన్నీ తాకట్టులో ఉన్నాయి గనుక, బయట తిరగలేను. అప్పు దొరకదు గనుక, మాంసం తినలేను." అని రాశాడు. మనం రోజూ అన్నం తిన్నట్టుగా పశ్చిమ దేశాల వారు రోజూ మాంసం తింటారు.

మార్క్స్ విషయంలో గూఢాచారులు అతీంద్రియ శక్తులున్నట్టే ప్రవర్తించారు. తన మీద నిఘా వున్నదని ఒక ఆకాశరామన్న ద్వారా తెలిసింది. ఆ గూఢచారి తనకు తెలిసివాడే. మార్క్స్ బృందంలో డిసెంబర్‌లో కొత్తగా ప్రవేశించాడు విల్హెమ్ ప్రషిల్లో. ఆ తర్వాత కొద్ది రోజులకే తెలిసింది. అతను ప్రష్యన్ గూఢచారి. కొలోన్ జైల్లో వున్న తన సహచరుల మీద నేరం రుజువు చేయటానికి సాక్ష్యాధారాల కోసం వచ్చాడు. నిజానికి లండన్‌కు వచ్చిన తొలి సంవత్సరంలో మార్క్స్ బృందం అత్యంత ప్రమాదకరమైన వ్యక్తుల్లాగే ప్రవర్తించారు. విప్లవం, రాజకీయ హత్యలు, అన్ని రకాల ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాల గురించి బాహాటంగా చర్చించింది. కాని హిర్ష్ వచ్చే నాటికి వాళ్లు కేవలం ప్రచారానికే పరిమితమైనారు. అంతేకాక డబ్బు లేక రోజులు గడవటమే కష్టమైంది. అయినప్పటికి ఆధారాలు పంపిస్తే బాగా డబ్బు ముడుతుందనే ఆశతో మార్క్స్ సమావేశాల మినిట్స్‌ను విల్హెమ్ తన అవసరానికి

జెన్నీ

అనుగుణంగా మార్చి రాశాడు.

మరో గూఢచారి సైబర్ కూడా పలు ఆధారాలు సేకరించాడు. అయితే వీళ్లిద్దరూ కాక మరొక గూఢచారి కూడా తనను నీడలా వెంబడిస్తున్నాడని తెలుసుకోలేకపోయాడు మార్క్స్. అతడు చేసిన ద్రోహం అంతా ఇంతా కాదు.

ఈస్టర్ నాటికి లండన్ వచ్చాడు ఎంగెల్స్. కాని ఈ సారి క్రిస్మస్‌లా సరదాగా గడవలేదు. ఇటీవలే జన్మించిన ఫ్రాంజిస్కా, బ్రాంకైటిస్‌తో బాధపడి ఏప్రిల్ 14 న తుది శ్వాస విడిచింది. ఆ పిల్లకు ఇంకా ఏడాదైనా నిండలేదు. అయితే 19వ శతాబ్దంలో శిశు మరణాలు సర్వసామాన్యం. సుమారు 15 శాతం మంది పిల్లలు ఏడాది నిండకుండానే మరణించారు. కాని, సామాన్య విషయమే అయినంత మాత్రాన తల్లిదండ్రుల బాధ తగ్గుతుందా! జెన్నీని తన చిన్న కూతురి మరణం బాగా గాయపర్చింది. దానికి తోడు రోజు రోజుకు తీవ్రతరమవుతున్న దారిద్ర్యం. అప్పటి వాళ్ల పరిస్థితి ఎంత దారుణమంటే ఫ్రాంజిస్కా అంత్యక్రియలకు శవపేటిక కొనటానికి డబ్బుల్లేవు.

అంత్యక్రియలు చేయలేక వెనుక గది ఖాళీ చేసి, కూతురి మృతదేహాన్ని అందులో పెట్టి (శవపేటిక కొనడానికి) డబ్బుల కోసం నిరీక్షించింది. "అందరం ఒకే గదిలో పడుకొని, పక్క గదిలో వున్న మా చిట్టి తల్లి కోసం కుమిలి కుమిలి ఏడ్చాం." అంటూ రాసుకుంది జెన్నీ. అనేక మందిని అడిగినా పైసా దొరకలేదు. చివరికి ఒక ఫ్రెంచి శరణార్థి రెండు పౌండ్లు ఇచ్చాడు.

తను ఈ లోకంలోకి వచ్చినప్పుడు ఉయ్యాల లేదు. ఇప్పుడు అంతిమ యాత్రకు శవపేటిక కూడా లేదు. చివరికి తన అన్న గుయిడోను చేరింది ఫ్రాంజిస్కా.

కాని మార్క్స్ దంపతులకు తమ కూతురి మరణం గురించి దు:ఖించడానికి కూడా సమయం లేదు. ఒకదాని తర్వాత ఒకటి అన్నీ దుర్వార్తలే. అమెరికాలో బ్రూమేర్ ప్రచురించటానికి ప్రయత్నించాడు వైడిమియర్. కాని, అది వీలుపడదని ఫ్రాంజిస్కా అంత్యక్రియల రోజే అతడి నుండి ఉత్తరం వచ్చింది.

"రెండేళ్లుగా అనుకున్నదొక్కటీ జరగడం లేదు. అమెరికా నుండి వచ్చిన ఉత్తరం, నన్ను కోలుకోలేని దెబ్బ తీసింది. కష్టాలను తట్టుకునే శక్తి నాకు బాగానే వుందనుకున్నాను. కాని ఇక భరించలేని పరిస్థితి వచ్చింది. కొన్ని సార్లు ఏమైనా చేసి డబ్బు సంపాదించాలనిపిస్తోంది." అన్నాడు మార్క్స్.ఇంచు మించు అదే చేశాడు మార్క్స్. యానోస్ చాంగ్యా అనబడే హంగేరియన్ జర్నలిస్టు

" జెన్నీని తన చిన్న కూతురి మరణం బాగా గాయపర్చింది. దానికి తోడు రోజు రోజుకు తీవ్రతరమవుతున్న దారిద్ర్యం. అప్పటి వాళ్ల పరిస్థితి ఎంత దారుణమంటే ఫ్రాంజిస్కా అంత్యక్రియలకు శవపేటిక కొనటానికి డబ్బుల్లేవు.అంత్యక్రియలు చేయలేక వెనుక గది ఖాళీ చేసి, కూతురి మృతదేహాన్ని అందులో పెట్టి (శవపేటిక కొనడానికి) డబ్బుల కోసం నిరీక్షించింది. "అందరం ఒకే గదిలో పడుకొని, పక్క గదిలో వున్న మా చిట్టి తల్లి కోసం కుమిలి కుమిలి ఏడ్చాం." అంటూ రాసుకుంది జెన్నీ. అనేక మందిని అడిగినా పైసా దొరకలేదు. చివరికి ఒక ఫ్రెంచి శరణార్థి రెండు పౌండ్లు ఇచ్చాడు. తను ఈ లోకంలోకి వచ్చినప్పుడు ఉయ్యాల లేదు. ఇప్పుడు అంతిమ యాత్రకు శవపేటిక కూడా లేదు. చివరికి తన అన్న గుయిడోను చేరింది ఫ్రాంజిస్కా "

మార్క్స్‌తో పరిచయం పెంచుకొని, త్వరలోనే ఆయన సహచరులలో ముఖ్యుడైనాడు. ఇతను గూఢచారి అని తెలుసుకోలేకపోయాడు మార్క్స్. చాంగ్యా చేసిన నమ్మకద్రోహంతో రాజకీయంగానే కాక, వ్యక్తిగతంగా కూడా నష్టపోయాడు. ఎంగెల్స్‌కు, ఇతరులకు మార్క్స్ రాసిన లేఖల ప్రకారం చాంగ్యాను మార్క్స్ పూర్తిగా నమ్మాడు. మార్క్స్ ఏప్రిల్ నాటికి అతడు పన్నిన వలలో పడిపోయాడు. లండన్‌లో ఉంటున్న జర్మన్ ప్రతిపక్ష నాయకుల గురించి తన సరదా కోసం కొన్ని స్కెచెస్ రాసుకున్నాడు మార్క్స్. హాస్యం, వ్యంగ్యం మిళితమైన రచనలు ప్రచురించే ఉద్దేశం కూడా లేదు. కాని, బెర్లిన్‌లో ఉన్న ఒక పబ్లిషర్ ఇలాంటి చిన్న పుస్తకానికి 25 పౌండ్లు యిస్తానన్నాడని చాంగ్యా చెప్పాడు. రచయితగా తన పేరు పెట్టుకోనక్కర్లేదు.

సహరచయితగా వుండటానికి ఎంగెల్స్ ఉత్సాహం చూపలేదు. ప్రతిపక్ష నాయకుల గురించి రాసిందెవరో తెలిసినపుడు ప్రచారమయ్యే స్కాండల్స్‌తో పోల్చితే, ఈ డబ్బు అంత ముఖ్యమా అని సందేహం కూడా వ్యక్తపరిచాడు. పైగా కొలన్‌లో సహచరుల మీద విచారణ కొనసాగుతున్నది. ఈ కీలక సమయంలో ప్రతిపక్షాలను విమర్శిస్తే, రాసిన వాళ్ల నిజాయితీ ప్రశ్నార్థకమవుతుంది. రియాక్షనరీ అని కూడా అంటారు. కాని డబ్బు అవసరంతో చాంగ్యా ప్రతిపాదనకే మొగ్గు చూపాడు మార్క్స్. ప్రతిని పబ్లిషర్‌కు ఇచ్చి డబ్బులు తెస్తానన్నాడు చాంగ్యా. మే నెలలో తన కృషి కొనసాగించటానికి మాంచెస్టర్ కెళ్లాడు మార్క్స్.

మార్క్స్ లండన్ వదిలిన ప్రతిసారీ, అప్పులవాళ్ల తిట్లను, శాపనార్థాలను జెన్నీ ఒంటరిగా భరించాల్సిందే. ఇప్పుడు కనీసం ఒక ఆశ ఉంది. త్వరలో డబ్బు వస్తుంది. మార్క్స్ మాంచెస్టర్‌లో వున్నప్పుడు, బెర్లిన్ పబ్లిషర్ ఇచ్చిన కాంట్రాక్ట్ పత్రమని చెప్పి జెన్నీకి కొన్ని కాగితాలిచ్చాడు చాంగ్యా. మార్క్స్ షరతులకు అతడు అంగీకరించాడని కూడా నమ్మబలికాడు. కాని కాంట్రాక్టు కాగితాలతో వస్తువులు కొనలేం. పాలు, బ్రెడ్డు, బంగాళాదుంపలు, బొగ్గు అర్జెంటుగా కావాలి. ఫ్రాంజిస్కా మరణం తర్వాత నెలరోజుల్లోనే వెళ్లిపోయాడు మార్క్స్. జెన్నీ ఇంకా ఆ విషాదం నుండి కోలుకోలేదు. కనీస అవసరాలకు కూడా డబ్బు లేకపోవడం వల్లనే గుయిడో, ఫ్రాంజిస్కా తనను వదిలి వెళ్లారని ఆమెకు తెలుసు.

అంత క్రితమే, ముగ్గురు పిల్లల్ని ఎంగెల్స్ వద్దకు పంపించాడు మార్క్స్. అప్పుడే ఎంగెల్స్ తండ్రి కూడా వచ్చాడు. అందువల్ల పిల్లలు మేరీ, లిజ్జీల వద్ద ఉంటున్నారు. ఇంట్లో ఎప్పుడూ కడుపు నిండని పిల్లలకు అక్కడ విందు భోజనం లభించినట్టుగా ఉంది. మాంసం, బఠాణీలు, బంగాళా దుంపలు, బ్రెడ్డు, వెన్న, జున్ను... పిల్లల సంతోషానికి హద్దు లేదు. ఇంట్లో అన్నీ ఉంటే తిండికి ఎందుకు మొహం వాచిపోతారు!

ఈలోగా జెన్నీ నుండి ఉత్తరం వచ్చింది "నేనిక భరించలేను. ఇలాంటి పరిస్థితి ఇదివరకెప్పుడు లేదు. రోజంతా ఏడుస్తూ కూర్చుంటున్నాను. చిన్న సాయం చేసే వాళ్లు కూడా ఎవ్వరు లేరు. తల పగిలిపోతుంది. వారం రోజులుగా ఓపిక పట్టాను. ఇక నా వల్లకాదు." అంటూ. మార్క్స్ జవాబులో, 90 శాతం చేయాల్సిన పనుల గురించి, 10 శాతం మాత్రమే సానుభూతి గురించి ఉంది. ఇలా రాయటానికి కారణం, ఎంగెల్స్‌తో సరదాగా కావచ్చు. మొత్తం మీద జెన్నీ బాధ ఆ క్షణాన ఆయనకు పట్టలేదు. లేదా సానుభూతి వల్ల అది మరింత పెరుగుతుందని, మనసు పనివైపు మళ్లించే ప్రయత్నమైనా అయి ఉండవచ్చు. ఆ తర్వాత మరో ఉత్తరంలో ఆమె చేయాల్సిన పార్టీ పనుల



చిట్టా పంపించాడు.

ఇంట్లో జరిగే రాజకీయ సమావేశాలు, చర్చలు, అప్పుల వాళ్ల వేధింపులకు అలవాటు పడి మార్క్స్ పిల్లలు ఇదే సహజమైన వాతావరణం అనుకున్నారు. కొంతవరకిది నిజం కూడా. వాళ్ల సావాసగాళ్లు కూడా పేద శరణార్థులైన ప్రతిపక్ష నాయకుల పిల్లలే మరి. మార్క్స్ దంపతులకు తెలుసు. అందరిలాగా మధ్యతరగతి వాళ్ల ఇళ్లలో పెరిగితే వాళ్ల దృక్పథం మరోలా ఉండేది. లండనుకు చేరేనాటికి వాళ్లకు తెలుసు, ఇక తమది సమస్యాత్మకమైన జీవితమని, పైగా ఈ కష్టాలను వాళ్లు ఐచ్ఛికంగా ఎంచుకున్నారని. ఇక మీదట వాళ్లు మరింత భయానకమైన చీకటి కుహరంలోకి ప్రవేశించబోతున్నారు. అవును మరి.వాళ్లకు అనుకూలంగా ఒక్కటి జరగటం లేదు.

"అంత క్రితమే, ముగ్గురు పిల్లల్ని ఎంగెల్స్ వద్దకు పంపించాడు మార్క్స్. అప్పుడే ఎంగెల్స్ తండ్రి కూడా వచ్చాడు. అందువల్ల పిల్లలు మేరీ, లిజ్జీల వద్ద ఉంటున్నారు. ఇంట్లో ఎప్పుడూ కడుపు నిండని పిల్లలకు అక్కడ విందు భోజనం లభించినట్టుగా ఉంది. మాంసం, బఠాణీలు, బంగాళా దుంపలు, బ్రెడ్డు, వెన్న జున్ను... పిల్లల సంతోషానికి హద్దు లేదు. ఇంట్లో అన్నీ ఉంటే తిండికి ఎందుకు మొహం వాచిపోతారు!

ఈలోగా జెన్నీ నుండి ఉత్తరం వచ్చింది "నేనిక భరించలేను. ఇలాంటి పరిస్థితి ఇదివరకెప్పుడు లేదు. రోజంతా ఏడుస్తూ కూర్చుంటున్నాను. చిన్న సాయం చేసే వాళు కూడా ఎవ్వరు లేరు."

జెన్నీ మరో మిత్రుడూ కలసి మార్క్స్, ఎంగెల్స్ కలిసి రాసిన The Great Man of The Exile సంపుటిని తయారు చేస్తున్నారు. ఆయా వ్యక్తుల సంభాషణలు డిక్టేట్ చేస్తున్నారు మార్క్స్. ఆ పని పూర్తి కాగానే మార్క్స్‌కు పద్దెనిమిది పౌండ్లిచ్చి (బహుశా అంతకు ముందు ఏడు పౌండ్లు యిచ్చివుంటాడు) రాత ప్రతి తీసుకున్నాడు చాంగ్యా. సహాయం చేసిన మిత్రుడికి కూడా డబ్బులిచ్చిన తర్వాత మార్క్స్ దగ్గర ఖర్చులకేమి మిగల్లేదు. పుస్తకం బాగా అమ్ముడుపోతుందనుకున్నాడు మార్క్స్. కాని అది ఎప్పుడు ప్రచురితమవుతుందో చెప్పలేదు చాంగ్యా. ఎంగెల్స్‌కు కూడా ఆర్థిక ఇబ్బందులు వచ్చినట్టే ఉన్నాయి. మరో ఆరువారాల పాటు ఏమీ పంపించలేనని ఆగస్టులో స్పష్టం చేశాడు. మిత్రుల సాయంతో వైడిమియర్ తిరిగి ప్రారంభించిన పత్రికల్లో బ్రూమేర్ అచ్చయింది, కాని పత్రిక పంపిణీకి డబ్బు లేకపోవడంతో అది ప్రెస్సు దాటి బయటికి పోలేదు. విల్హెంపైపర్ చేసిన ఇంగ్లీషు అనువాదం తప్పులతడకగా ఉండటంతో, అది లండన్‌లో అమ్ముడుపోయే అవకాశం లేదు. జర్మనీలో కూడా ప్రచురించటానికెవ్వరూ ఆసక్తి చూపలేదు. ఇలాంటి రచన వీలైనంత త్వరగా పాఠకులకు చేరాలి. లేకపోతే ఫ్రాన్సులో జరిగిన సంఘటనలు గురించి ఎవరికి తోచిన పద్ధతిలో వాళ్లు రాసి ప్రచురించే అవకాశముంది. ఈ చికాకులన్నీ సరిపోవన్నట్టు తన శత్రువు ప్రూధో 'లూయీ నెపోలియన్' గురించి రాసిన పుస్తకం ఆయనకు లక్ష ఫ్రాంకులు సంపాదించి పెట్టింది.

ఆ రోజుల్లో డబ్బు గురించి మార్క్స్ ఎంత ఆందోళన చెందాడో ఆయన ఉత్తరాలు చదివితే అర్థమవుతుంది. ఎంత కష్టపడినా, ఎంత రాసినా తనదొక్కటీ అచ్చు కాదు. పైసా కూడా రాదు. కాని తన ప్రత్యర్థులు రెండు చేతులా సంపాదిస్తున్నారు. దీనికి తోడు వ్యక్తిగత నిందలు కూడా పెరిగాయి. అమెరికాలో సిన్‌సినాటిలో పర్యటిస్తున్న ఒక జర్మన్ శరణార్థి "మార్క్స్, ఎంగెల్స్ అసలు విప్లవకారులే కాదు, లండన్‌లో కార్మికుల చేత తిరస్కరింపబడిన, అవమానించబడిన పగటివేషగాళ్లు" అంటూ ప్రచారం చేశాడు. విమర్శలు, నిందలు తనను బాధించవని అనేకసార్లు చెప్పుకున్నాడు మార్క్స్. కాని, ఆర్థిక పరిస్థితి, ప్రచురణ కాని రచనలూ అతడి సహనాన్ని పరీక్షించాయి.

"ఎంతని భరించడం? ఎన్నాళ్లని భరించడం? ఓపిక పూర్తిగా నశించింది. ఇంట్లో అందరూ పడకేశారు. కాని డాక్టర్లను పిలవటానికి డబ్బుల్లేవు." అని ఎంగెల్స్‌తో చెప్పుకున్నాడు మార్క్స్. "వారం, పదిరోజులుగా ఇంట్లో అందరం కేవలం బ్రెడ్డు, బంగాళా దుంపల మీదే బతుకుతున్నాం. (మాంసం తినకపోతే ఉపవాసమున్నట్టే ఉంటుంది, అటు) ఇక ఇవి కూడా కొనగలమన్న నమ్మకం లేదు. నలువైపులా చీకటి ముసురుతోంది. బ్రెడ్డు అమ్మినవాడు, కూరగాయలవాళ్లు, కసాయి వాళ్లు అందరూ అప్పు తీర్చాలని నిలదీస్తున్నారు. ఇల్లు (డాక్టర్‌లేని) ఆస్పత్రిగా మారింది. ఏమి చేయలేకపోయినా, వీళ్ల కోసం నా సమయమంతా కేటాయించక తప్పటం లేదు." అని రాశాడు.

ఈ సమస్యలలో చివరి మజిలీ తాకట్టు కొట్టు. అక్కడ వస్తువు ధరలో మూడోవంతు మాత్రమే దొరుకుతుంది. కాని, వడ్డీ పోగా మిగిలేది అంతకన్నా తక్కువ. జెన్నీ వద్ద ఉన్న వెండి వస్తువులను మార్క్స్ తాకట్టు పెట్టటానికి ప్రయత్నించినప్పుడు, ఈ విదేశీ శరణార్థి దొంగసొత్తు పట్టుకొచ్చాడంటూ మార్క్స్‌ను అరెస్టు చేయమన్నాడు కొట్టు యజమాని. బహుశా, అవమాన భారంతో కుంగిపోయిన మార్క్స్ తరువాత ఏమైందో రాయలేదు. అయితే, ఈ పరిణామాన్ని గురించి రెండు కథనాలు వినిపిస్తున్నాయి. తాను బ్రిటన్ ఉన్నత వంశానికి చెందిన మహిళను వివాహం చేసుకున్నానని, కొట్టు యజమానికి నచ్చ జెప్పాడు మార్క్స్. మరొక కథనం ప్రకారం, మార్క్స్‌ను అరెస్టు చేసి రాత్రంతా పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టారు. చివరికి జెన్నీ వచ్చి తన కుటుంబ నేపథ్యం గురించి పోలీసులకు సాక్ష్యాలు చూపింది. ఈ రెండు కథనాల్లో ఏది నిజమైనా మార్క్స్ మాత్రం ఘోర అవమానాన్ని చవిచూడక తప్పలేదు. చివరికి తాకట్టు కొట్టు మనిషి దృష్టిలో కూడా తానంతగా దిగజారిపోయాడు.నిరుపేదలుండే బస్తీలో అందరి కంటే పేదవాడు.

"కొలోన్ జైల్లో వున్న తన సహచరులు నిరపరాధులని నిరూపించటానికి ప్రయత్నాలు ఊపందుకున్నాయి. మార్క్స్ అపార్ట్‌మెంట్ ఈ కార్యకలపాలకు కేంద్రంగా మారింది. కార్యకర్తలంతా అక్కడే గుమిగూడారు. చిల్లరంతా పోగుచేసి వాళ్లకు తినటానికి ఏదైనా తెచ్చి పెడుతున్నారు మరికొందరు. పిల్లలు అక్కడే గట్టిగా పాటలు పాడుతూ, ఈలలు వేస్తూ గోల చేస్తున్నారు. వాళ్ల నాన్న అప్పుడప్పుడు కేకలేస్తున్నారు." అంటూ వాషింగ్టన్‌లో ఉన్న మిత్రుడు అడాల్ఫ్ క్లస్‌కు రాసింది జెన్నీ.

సశేషం

▪ ఫోన్: 91776 18708

పెరుగన్నం సద్ది

కావలసిన పదార్థాలు: బియ్యం-ఒక కప్పు,పెరుగు-రెండు కప్పులు, పచ్చి మిరపకాయలు-నాలుగు , ఆవాలు-అర టీస్పూను, జీలకర్ర-అర టీ స్పూను, ఎండు మిరపకాయలు-రెండు, సొంటి-కొద్దిగా, శనగపప్పు-ఒక టేబుల్ స్పూను, జీడిపప్పు-పది, కరివేపాకు-రెండు రెబ్బలు, ఉప్పు-తగినంత, నెయ్యి-రెండు టేబుల్ స్పూన్లు

తయారు చేసే విధానం

అన్నం వండి పక్కన పెట్టుకోవాలి. స్టౌ మీద గిన్నె పెట్టి నెయ్యి వేసి బాగా కాగాక జీడిపలుకులు వేసి వేగించి తీసేయాలి. తరువాత ఆవాలు, జీలకర్ర శెనగపప్పు, కరివేపాకు, పచ్చి మిరపకాయలు,ఎండు మిరపకాయలు, సొంటి వేసి వేగించి దించేయాలి. దీన్ని అన్నంలో కలపాలి తరువాత ఇందులో పెరుగు, తగినంత ఉప్పు వేసి కలపాలి.



పెరుగు చట్నీ

కావలసిన పదార్థాలు: గింజలు తీసిన బూడిద గుమ్మడి ముక్కలు-అరకప్పు,పెరుగు-2 కప్పులు ,పచ్చికొబ్బరికోరు-1 కప్పు,పచ్చిమిర్చి-3, పసుపు-చిటికెడు, ఆవాలు-1 టీ స్పూను , ఎండు మిర్చి-1, మెంతులు-పావు టీ స్పూను, నూనె-1 టీ స్పూను, కరివేపాకు-4 రెబ్బలు.

తయారు చేసే విధానం

గుమ్మడి ముక్కల్లో పసుపు,ఉప్పు వేసి ఉడికించాలి. కొబ్బరికోరు పచ్చిమిర్చి కలిపి పేస్టు చేసుకోవాలి. ఉడికిన గుమ్మడి ముక్కల్లో గిలకొట్టిన పెరుగు, కొబ్బరి, ఆవాలు, మెంతులతో తాలింపు వేసి గుమ్మడి మిశ్రమంలో కలపాలి . ఈ పచ్చడి పరాటాలతోనే కాదు! అన్నంలో కూడా బాగుంటుంది.

దహీ బేంగన్

కావలసిన పదార్థాలు: వంకాయలు-200గ్రా, పెరుగు-పావు కిలో శనగపిండి-50 గ్రా, ఉప్పు-రుచికి తగినంత,నూనె- సరిపడా, ఆవాలు-1 టీ స్పూను, కరివేపాకు-4 రెబ్బలు, ఇంగువ-పావు టీ స్పూను, ఎండు మిర్చి-2 , కారం -పావు టీ స్పూను

తయారు చేసే విధానం

వంకాయల్ని పొడుగ్గా తరగాలి. శనగపిండిలో చిటికెడు ఉప్పు, కారం వేసి బజ్జీల పిండిలా కలపాలి. ముక్కల్ని పిండిలో ముంచి నూనెలో దోరగా వేగించి పక్కనుంచాలి. తర్వాత పెరుగు ఉప్పు కలిపిన పాత్రలో ముక్కల్ని వేయాలి. ఇప్పుడు తాలింపును ముక్కల పెరుగులో కలపాలి, ఈ కర్రీ రోటీతో బాగుంటుంది.



కొత్తిమీర పెరుగు చట్నీ

కావలసిన పదార్థాలు

కొత్తిమేర-2 కప్పులు,కొబ్బరికోరు-3/4 కప్పు, పచ్చి మిరపకాయలు-2 ,పెరుగు-1 కప్పు, ఉప్పు-తగినంత, మినపప్పు-1 టీ స్పూన్, శనగపప్పు-1 టీ స్పూన్ ఆవాలు-1/2 టీ స్పూన్, ఎండు మిరపకాయ-1, నూనె-సరిపడినంత, కరివేపాకు, ఇంగువ-చిటికెడు

తయారు చేసే విధానం

కొత్తిమీర కడిగి గ్రైండ్ చేయండి. బాణలిలో నూనె పోసి కాగిన తర్వాత శనగపప్పు ఆవాలు, మినప పప్పు వేయించండి. ఎండు మిరపకాయ ముక్కలు, కరివేపాకు ఇంగువ వేసి ఒకసారి వేయించి పక్కకు తీయండి. పెరుగులో చిటికెడు పసుపు సరిపడినంత ఉప్పువేస్తే కొత్తిమీర పెరుగు పచ్చడి రెడీ. ఇది వేడివేడి అన్నంలోకి రోటీల్లోకి తింటే రుచిగా ఉంటుంది.

రంగులు వేసేద్దామా...

మీకు చందమామ అంటే చాలా ఇష్టం కదా.. అందమైన చందమామకు రంగులు వేయండి.

ఎవరి పేరు ఏదో మరి

మీకోసం ఓ పజిల్ తీసుకొచ్చాం. అదేంటంటే... ఇక్కడ కొన్ని జంతువులు, పదార్థాలు ఉన్నాయి. వాటికి ఎదురుగా పేర్లు కూడా ఉన్నాయి. సరైన పేరు ఏదో జత చేసేయండి.

Scarecrow

Acorn

Leaf

Apple

Corn

Rake

Squirrel



చుక్కలు కలపండి

రోజా బొమ్మ గీద్దాం

ఇవాళ మీకోసం రోజ పూవ్వు ఎలా వేయాలో నేర్పుతాడట ఆర్టిస్టు అంకుల్. కింది బొమ్మల ఆధారంగా గీస్తారా!



ఏమేం వున్నాయి?

ఇక్కడ ఓ జీవి ఉంది. అందులో మొత్తం రెండు జంతువుల శరీర భాగాలున్నాయి. వాటి పేర్లేంటో చెప్పండి.

డ్లో 'ఠధిఌ :ణాఅఇ



దారి చెప్పండి

ఈ చిత్రంలోని కోడిపెట్ట తన పిల్లల ఆహారం కోసం బయటికి వెళ్ళింది. తిరిగి వచ్చే దారి మర్చిపోయింది. కాస్త దారి చూపించి... దాన్ని పిల్లల దగ్గరకు చేర్చండి.

పదాలు పట్టుకోండి!

కింద పజిల్లో ఆరు బొమ్మలు వాటి పేర్లు ఇచ్చారు. అయితే ఎదురుగా ఉన్న అక్షరాల సమూహంలో అవన్నీ దాక్కున్నాయి.వాటిని మీరు గుర్తించి సున్నా చుట్టండి.

tea	p	r	a	e	t	e
pony	o	o	q	h	e	e
duck	n	b	q	k	p	k
snake	y	o	q	c	a	a
grape	v	t	t	u	r	n
robot	k	t	q	d	g	s

బుడుగు

నేటి కౌటిల్యుడు!

మీకు చాణక్య చంద్రగుప్త కథల గురించి తెలిసి ఉంటుంది. చాణుక్యుడికి కౌటిల్యుడనే మరోపేరు ఉంది. కాని, ఆ కౌటిల్యుడు కాక ఇప్పటి బుడత కౌటిల్యుడు గురించి విన్నారా. వండర్ కిడ్, గూగుల్ బోయ్ అనిపించుకుంటున్న కౌటిల్య పండిట్ గురించి మీకు తెలుసా. 213 దేశాల వివరాలను తడబడకుండా చెప్పేస్తాడు. ఇంతకీ ఈ పిడుగు వయసు ఎంతనుకున్నారు? ఏడేళ్లే! నేటి కౌటిల్యుడి గురించి తెలుసుకోండి మరి. హర్యానాలోని కర్నాల్ జిల్లా కోహండ్ గ్రామం కౌటిల్యాది. అతడి తండ్రికి ఎస్‌డి హరిత్ మోడ్రన్ పాఠశాల ఉంది. చిన్నప్పటి నుంచి కౌటిల్యవిషయాల్ని బాగా గుర్తుపెట్టుకోగలడం వాళ్ల నాన్న గమనించి అట్లాస్‌ను కొనిపించాడు. దాన్ని రోజూ చదువుతూ బాగా మననం చేసుకున్నాడు కౌటిల్య. దేశాల పేర్లని రాజధానులతో సహా చెప్పేస్తూ ఆశ్చర్యం కలిగించేవాడు. బాగా తర్ఫీదునివ్వడంతో ఏడేళ్ల వచ్చేనాటికి 213 దేశాలవివరాలు తప్పుకాకుండా చెప్పేస్తున్నాడు. కేవలం చిన్న చిన్న వివరాలనే కాక, ఆ దేశాల భౌగోళిక విషయాలు, జీడీపీ, ఆదాయ మార్గాలు వంటి ఆర్థిక గణాంకాలను పొల్లుపోకుండా లెక్కచెబుతున్నాడు. అంతేకాదు! టీవీ కార్యక్రమాల్లో పాల్గొని అదరగొట్టేశాడు. అబ్దుల్ కలాం తాత కూడా కౌటిల్యను పిలుపించుకుని మెచ్చుకున్నాడు. అమితాబ్ బచ్చన్ కూడా తమ టీవీ కార్యక్రమం కౌన్ బనేగా కరోడ్‌పతిలో కౌటిల్య చేత ఆడించాడు. ప్రశ్నలకు టకటకా జవాబులు చెప్పేస్తుండటంతో అమితాబ్ ఎంతగానో మురిసిపోయాడు. ఇక హర్యానా ముఖ్యమంత్రి కౌటిల్య ప్రతిభను గుర్తిస్తూ పది లక్షల రూపాయల్ని అతడి పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించాడట. ఇంకో విశేషమేమిటంటే, తనకు ఇచ్చిన ప్రశంసా పత్రంలో తన తల్లి పేరు స్పెల్లింగ్ తప్పును గుర్తించి ముఖ్యమంత్రికే చెప్పాడట.

ఇక కురుక్షేత్ర విశ్వవిద్యాలయం మానసిక విశ్లేషకులు కౌటిల్య తెలివితేటల్ని పరీక్షించి అతడికి 130 ఐక్యూ ఉందని తేల్చారు. సాధారణ పిల్లల స్థాయి కన్నా ఇది చాలా ఎక్కువ. మరి అన్ని వివరాలు ఉండే గూగుల్‌తో పోల్చి పేరు పెట్టడంలో తప్పేం ఉంది.

పిల్లలూ! మీరు కూడా ఇలా విషయాల్ని బాగా గుర్తు పెట్టుకోగలిగినా లేదా ప్రత్యేక నైపుణ్యం మరేదైనా ఉన్నా సరైన శిక్షణ తీసుకోండి. దాన్ని అలవాటుగా చేసుకోండి. తల్లిదండ్రులూ మీరు కూడా పిల్లల్ని ప్రోత్సహిస్తే వాళ్లూ ఆడుతూ, పాడుతూ నేర్చుకుని మంచి పేరు తెచ్చుకుంటారు.

ఎస్వీ అక్షర అలజడి

ఈ గ్రంథ తొలి ముద్రణకు ఆచార్య కొలుకలూరి ఇనాక్ ముందు మాట రాశారు. (1997) అరసం అధ్యక్షులైన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి 'అవసరమైన నేపథ్యం' అంటూ కవి ఆంతర్యాన్ని ఆవిష్కరించారు. నవచేతన తొలి కెరటం "దళిత సాహిత్య నేపథ్యం" విశ్లేషించిన చిరు పొత్తాన్ని ప్రచురించిన సందర్భాన్ని రచయిత కవి డా॥ ఎస్వీ సత్యనారాయణ రాశారు. ఈ చిన్న పుస్తకంలో పరిశోధకుడు చాలా విషయాలను నిక్షిప్తం కావించాడు. దళిత సాహిత్యం కూడా ఇందులో పరిశీలనం పొందింది. 'ఉప్పెన' సంకలనం (1977 ప్రచురణ) కూడా అనుబంధంగా ఇవ్వడం బాగుంది. హరిజన, గిరిజన, బలహీన వర్గాలపై అత్యాచారాలపై నిరసనకు అక్షర సంఘీ భావంగా ఆనాడు వ్యవసాయ కార్మిక సంఘం 1977 సెప్టెంబర్‌లో 'ఉప్పెన'ను ప్రచురించింది. తెలుగు సాహిత్యంలో ఇది మొదటిది. ఆస్ట్రేలియాలో ఎబోరిజన్స్, ఆఫ్రికాలో నీగ్రెడ్స్, అమెరికాలో రెడ్ ఇండియన్స్ వలె దక్షిణ భారతదేశంలోని అనార్యులైన ద్రవిడులు, దళితులు ఈ నేలతల్లి బిడ్డలు. ఈ భూమిపుత్రులు. మూలవాసులు.



దళిత సాహిత్య నేపథ్యం,
రచన: డా॥ ఎస్వీ సత్యనారాయణ,
పేజీలు: 80,
వెల: రు. 50/-,
ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్ : బండ్లగూడ(నాగోల్).

వీరికే రాజ్యాన్ని పాలించే అధికారం దక్కాలనేది మూల వాసీ సిద్ధాంత సారాంశం. "ఈ దేశ వాసులం. ఈ భూమి పుత్రులం. మేం మూల వాసులం. ఆది అసలు జాతులం" అంటున్న మాష్టార్జీ దళితుల ఆత్మ గౌరవం కోసం పోరాటానికి పిలుపునిస్తున్నాను. "వృత్తం వెలుపలే ఉత్తమ వచనంలా పరిభ్రమించిన నాకు మరణమెప్పుడూ పునరావృత్తమే (వృత్తాంతం) అనే పంచమ వేదాన్ని లిఖించారు సతీష్ చందర్. దళిత కళామండలి పాటలు (1992), గుండె డప్పు (1993), కరీంనగర్ జిల్లా దళిత పాటలు (1993), చిక్కనవుతున్న పాట (1995), దళిత మ్యానిఫెస్టో (1995), పదునెక్కిన పాట (1996), ప్రవహించే పాట కవితా సంకలనాలు సమకాలీన దళిత కవుల గొంతులోని వైవిధ్యాన్ని, వైరుధ్యాలనూ, క్రమ పరిణామాన్ని సూచిస్తున్నాయి. నిశాని, బహువచనం, నల్లగొండ దళిత స్వర సంకేతం, దళిత వాదానికి సంకేత ప్రతులుగా ఉన్నాయి (పేజీ 45). ఎస్సీ, ఎస్టీ, బిసి మైనారిటీల మధ్య సాంఘిక ఐక్యత, పోరాట సమన్వయం ప్రారంభమైంది. గాంధీజీ ఉపవాస దీక్షను ప్రారంభించినపుడు (1913-ఫిబ్రవరి18) గరిమెళ్ళ సత్యనారాయణ హరిజనుల పాటలు ప్రకటించారు (పేజీ 32). ఇలాంటి ఎన్నో ఉదాహరణలతో దళిత సాహిత్య నేపథ్యాన్ని డా॥ ఎస్వీ సత్యనారాయణ విపులంగా గ్రంథస్తం చేశారు ఈ చిన్న పుస్తకంలో.

-తంగిరాల చక్రవర్తి

ప్రగతికి ప్రస్థానం సైన్సు

పదునైన ఆ "లోచన" అంటూ ప్రొఫెసర్ సి. సుబ్బారావు (మాజీ చైర్మన్ ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి) చక్కటి ముందు మాట రాశారు. డా॥పి.ఎస్.గోపాలకృష్ణ గారికి ఈ సైన్సు పుస్తకాన్ని రచయిత నాగసూరి వేణుగోపాల్ అంకితం చేశారు. సైన్సు, టెక్నాలజీ రంగాలు ఎవరి కోసం ఎలా పని చేయాలి? ఈ రంగాలతో మిగతా రంగాల పట్ల సంబంధాలు ఏమిటి? ప్రజలకివి ఎలా దోహదపడాలి? అనే విశ్లేషణలకు ఆసక్తికరమైన సమగ్ర సమాచారంతో ఈపుస్తకం రాశారు రచయిత. ఈ పుస్తకంలో దాదాపు 42 అంశాలపై చక్కటి వ్యాసాలున్నాయి. ఈ వ్యాసాల్లో విజ్ఞానం- ఆలోచన, ధనవంతులు విలాస జీవితాలు తెలుపుతాయి. నీతూ అంబానీతో వచ్చిన ముఖేష్ అంబానీ తల్లి కోకిలాబెన్ సంచి నగలను, కరెన్సీని హుండీలో వేశారు అప్పట్లో. ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌లలో తమ జట్టు విజయం సాధించాలనే వీరు ఇరువురు కానుకలు సమర్పించారన్నది పత్రికలు తెలిపిన విషయం. కప్పు కోసం కోట్లాది రూపాయలు వెంకన్నకు కానుకలు ఇచ్చి వేడుకోవడాన్ని నిరసిస్తారు రచయిత. భూమి మీద పది కోట్ల జీవరాశిలో కేవలం 14,35,662 జీవులనే మనం గుర్తించగలిగాం. ప్రతి సంవత్సరం 27,000 రకాల జాతి సంపద అంతరించిపోతోందట. 2050 సంవత్సరం నాటికి నాల్గో వంతు జీవరాశి భూగోళం నుంచి తప్పుకుంటుంది (పేజీ 30). దొడ్డిదారిలో విజయం సాధించాలనే పట్టుదలకు టెక్నాలజీ చెలిక త్తెగా మారింది. మెడిసిన్ పేపర్ కోసం 15 లక్షల రూపాయలు (కాపీయింగ్ కోసం) డిమాండ్ చేశారన్నది మరో పార్శ్వం (పేజీ 31). "సైన్సు-దేవుడు" అనే వ్యాస ంలో 'దేవుడనే భావన అర్థ రహితమని రేపు తేటతెల్లమైతే కావచ్చు. కాని ప్రస్తుతం దాకా ఈ భావన సైన్స్ పరిధిలో లేదని గ్రహించాలి' అంటారు. నేడు కంప్యూటర్, ఐటి హడావుడి అధికమై అమ్మ లాంటి గణిత శాస్త్రం నిరాదరణకు గురవుతోంది అంటారు 'ఓల్డేజి హోంలో గణితం' అనే వ్యాసంలో. 'టెక్నాలజీకి జై' అనే వ్యాసంలో మన దేశంలో తొలి ఆధార్ గుర్తు సంఖ్య 782474317884. ఇది మహారాష్ట్ర గిరిజన మహిళ రంజన సోనావాణేది. మానవ జననం తొలుత ఆఫ్రికాలో మొదలైంది. అని తెలుసుకున్న టాగూర్ 'ఆఫ్రికా' అనే పద్యం రాశారు (పేజీ 56). టెక్నాలజీతో అవినీతికి చెక్, సైన్స్ టెక్నాలజీ రెండూ ఒక టేనా? (పేజీ 103).. వెంటాడే నాయుడమ్మ వాక్యం .. పర్యావరణ నేత్రం కావాలి (పేజీ 131), శిరస్సున కిరీటం (పేజీ 128), లాంటి వ్యాసాలు పాఠకుల్ని అలరించడమే కాదు ఆలోచింపజేస్తాయి.



ప్రగతికి ప్రస్థానం సైన్సు,
రచయిత : డా॥ నాగసూరి వేణుగోపాల్,
పేజీలు: 133, వెల:90/-
ప్రతులకు: నవ చేతన పబ్లిషింగ్ హౌస్.

- ప్రసన్న కుమారి

మీసాల వీరుడు

"వారెవా... ఎంత పా...డ..వా..టి మీసాలు?! అసలు ఎలా పెంచాడింతగా. ఎన్నేళ్ల నుంచి వాటిని పెంచుతున్నాడు? ఆయన ఏమేం నూనెలు, షాంపూలు వాడతాడు?" అన్నవేగా మీ అనుమానాలు. మీకే కాదండీ. ఈయనగారిని చూసిన ప్రతి ఒక్కరికి కలిగే సందేహాలివే. ఈ మీసాల రాయుడి పేరు రామ్ సింగ్ చౌహాన్. రాజస్థాన్ వాసి. గత ముప్పై ఐదేళ్లగా మీసాలను ప్రేమగా పెంచుకుంటున్నాడు. ఇప్పటి వరకు వాటి మీద బ్లేడు పెట్టలేదంటే నమ్మండి. ఇంతకీ ఇతని మీసాల పొడవు ఎంతనుకున్నారు. పద్నాలుగడుగులు. రెండు సార్లు ప్రపంచ రికార్డులు బద్దలు కొట్టాడీ మీసాలతోనే. పొద్దున లేచిన వెంటనే అతను చేసే మొదటి పని మీసాలకు నూనె రాసి.. మర్దన చేసి... చిక్కు తీసి.. దువ్వుకోవడం. అందుకోసం కనీసం రెండు గంటల సమయం వెచ్చిస్తాడట. లేచీ లేవగానే మీసాల సేవలో మునిగిపోతే భార్యామణిగారు ఊరుకుంటారా? అన్న అనుమానం వచ్చేస్తుంది మనకు. ఆవిడ కూడా మొదట్లో అడపా దడపా గొడవ పెట్టుకునేదట. తర్వాత్తర్వాత అలవాటైపోయిందేమో! తనే సర్దుకుపోయిందట. కానీ ఈ మీసాల వల్లే అతనికి ప్రభుత్వ ఉద్యోగం వరించింది. అదీ రాజస్థాన్ టూరిజం విభాగంలో. ఎంచక్కా తన మీసాలతో పర్యాటకులను ఆకర్షించి అలరించడం అతని ఉద్యోగం. ఈ మీసాల వల్లే జర్మనీ, ఇటలీ సందర్శించే అవకాశం వచ్చింది. జేమ్స్‌బాండ్ చిత్రంలో నటించే సువర్ణావకాశాన్ని కూడా అందిపుచ్చుకున్నాడు. రెండుసార్లు గిన్నిస్ వరల్డ్ రికార్డును బద్దలు కొట్టాడు. "ఏమైనా మగాడన్నాక మీసం వుండాలి. కానీ ఇవాళ్టి యువకులు వున్నారు చూశారూ... మీసాల్లేకుండా తిరుగుతున్నారు. మీసాలంటేనే మగతనం. వాటిని పెంచుకోవాల్సిందే" అంటాడు మీసం మెలేస్తూ చౌహాన్. ●

‘వర్ణ’ మాల

అదో మొజాయిక్ వనం. వర్ణశోభిత కళల వరం. గాజు ఫలకాలు, శిలా వలయాలతో పొందికగా అమరిన విశాల కుహరం. భూ గర్భాన, పర్వత పాదాన దాక్కున్న మానవీయ మాయా లోకం. మనిషి కోసమే సృజించుకున్న ఆలయం. అద్భుత కళా కల్పవల్లి. పర్యాటకుల నెచ్చెలి... ‘టెంపుల్ ఆఫ్ హ్యూమన్ కైండ్’గా ప్రసిద్ధికెక్కిన ‘డామన్‌హర్’. ప్రకాశవంతమైన రంగులు, ప్రశాంతమైన చిత్తరవులు, హాయిగొలిపే అమరికలు, విస్తుగొలిపే శిల్పాలతో దేవ లోకాన్ని తలపిస్తుంది. సరికొత్త వాస్తుకళతో వింత లోకపు ద్వారాల్ని తెరుస్తుంది.

ఉత్తర ఇటలీలో ఆల్ప్స్ పర్వత సానువుల్లోని డామన్‌హర్ ప్రాంతంలోని విడ్రాకో పర్వత పాద గర్భంలో వెలసిందిది. ఫాల్కో టారాసాకో (ఆబెర్టో అయిరాది) అనే ప్రకృతి ప్రేమికుడు, మానవతారాధకుడిదీ స్వప్నం. ఎందరో కళాకారుల మేధోసంపత్తి. పది మంది మిత్రులతో కలసి 1976లో ఫాల్కో దీని నిర్మాణాన్ని చేపట్టగా, మరికొందరు జత కలుస్తూ పదహారేళ్లు కొండను తొలచి తమ కళలను ధారపోసి ఈ అద్భుత కళాఖండాన్ని సృజించారు. ఎటువంటి భారీ యంత్రాలు, ఆధునిక పరికరాలు లేకుండా కేవలం చేతి పనిముట్లతోనే దీని నిర్మాణాన్ని పూర్తిచేశారు. రహస్యంగా సాగిన దీని నిర్మాణంపై వార్తలు వస్తున్నా 1992లో గాని అక్కడి అధికారులు కనుక్కోలేకపోయారు. అనుమతులు లేకుండా నిర్మించారంటూ ధ్వంసం చేయబోయిన వారే దీని కళా సౌందర్యానికి ముగ్ధులై ఎలాగైనా కాపాడుకోవాలని సంకల్పించారు. తొలిసారి వాటిని చూసి భావోద్వేగానికి లోనై కళ్లెమ్మట నీరు కారిందట. వీరికి మద్దతుగా ప్రపంచంలోని కళాపిపాసులూ స్వరం కలపడంతో ఇటలీ తన చట్టాల్నే మార్చుకుని దీని సంరక్షణకు చర్యలు తీసుకుంది. ప్రపంచ ఎనిమిదో వింతగా ప్రాచుర్యం పొందుతున్న ఈ నిర్మాణం కేవలం కళావైభవానికే కాదు మానసిక వికాసానికి చిరునామా. ●